విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

సోమవారం 22, జనవరి 2024 8పేజీలు



నేడు ఓటర్ల తుది జాబితా విడుదల

అందరిలో ఉత్కంఠత

విశాలాంధ్ర -చిత్తూరు: జిల్లాలో ఓటర్ల తుది జాబితాను సోమవారం జిల్లా అధికార యంత్రాంగం విడుదల చేయనున్నది. ఇటీవల జిల్లాలో భారీ స్థాయిలో దొంగ ఓట్లు నమోదు చేశారని ప్రతిపక్షాలు ఫిర్యాదులు చేశారు. ఈ నేపథ్యంలో గత తిరుపతి పార్లమెంట్ ఉప ఎన్నికల్లో భారీగా దొంగ ఓట్లు నమోదు అయినట్టు గుర్తించి ఒక ఐఏఎస్ ఆఫీసర్ తో పాటు ఇద్దరు అధికారులపై సస్పెన్షన్ వేటు వేసిన సంగతి తెలిసిందే. జిల్లాలో పలు నియోజవర్గాల్లో భారీగా దొంగ ఓట్లు నమోదు అయినాయని వాటిని తొలగించి ఖచ్చితమైన ఓటర్ జాబితాను తయారు చేయాలని ప్రతిపక్ష పార్టీలు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన సైతం చేపట్టాయి . పలుచోట్ల చనిపోయిన వారిని ఇతర ప్రాంతాలు వచ్చిన వారిని ఓటర్ జాబితాలో పొందుపరిచినట్లు స్పష్టమైన ఆధారాలతో అధికారులకు ఫిర్యాదు చేశారు. జిల్లాలో ఓటరు జాబితా పై జరిగిన పలు సమీక్ష సమావేశంలో సైతం అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సమగ్రంగా విచారించి ఓట్ల నమోదు ప్రక్రియను కొనసాగించాలని ఆదేశించారు .ఈ నేపథ్యంలో సోమవారం విడుదలయ్యే తుది జాబితా లో ఎలాంటి పొరపాట్లు ఉన్న సంబంధిత అధికారులు ఇందుకు బాధ్యత వహించాల్సి ఉంటుంది. దీంతో అధికార యంత్రంలో తీవ్ర ఉత్కంఠత పరిస్థితి నెలకొంది.

పీడిత ప్రజల ఆశాజ్యోతి లెనిన్

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు

విశాలాంధ్ర-తిరుపతి: బడుగు,పీడిత ప్రజల జీవితాల్లో ఆశాజ్యోతి లెనిన్ అని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు అన్నారు.ఆదివారం తిరుపతి లోని గందమనేని శివయ్య భవనం ప్రాంగణం లో లెనిన్ 100వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రష్యా అంతటా ఆనాడు మహా విప్లవాన్ని నడిపిన సర్వ సైన్యాధిపతి, మార్క్సిస్టుజాన్ని పూర్తిగా అధ్యయనం చేసిన లెనిన్ ఆయన మరణం ప్రపంచ కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటు అన్నారు.1924 జనవరి 27 న ఆయన అనారోగ్యంతో మృతి చెందారన్నారు.లెనిన్ 1905 లో తిరుగుబాటు కు నాయకత్వం వహించారు.అలాగే 1917 సంవత్సరం లో అక్టోబర్ లో మహావిప్లవానికి నాంది పలికారన్నారు.జార్ చక్రవర్తి బంగాళా ను ఆక్రమించి రష్యా ను సోషలిస్టు దేశం గా ప్రకటించారన్నారు.కాగా ఎన్నో ఉద్యమాలు చేసిన క్రమంలో దేశ బహిష్కరణ కు గురయినప్పటికీ ధైర్యం కోల్పోకుండా పుస్తకాలు రాసి ప్రజా చైతన్యం తీసుకొచ్చారన్నారు.పార్టీ నిర్మాణాత్మక అభివృద్ధి కి ఆయన రచనలు దోహదం చేసాయన్నారు.బడుగు బలహీన వర్గాలు బానిస బతుకులకు చమరగీతం పాడేందుకు అహర్నిశలు కృషి చేసి ప్రాణాలు అర్పించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి, నగర కార్యదర్శి విశ్వనాథ్, ప్రజా సంఘాల నాయకులు పద్మనాభ రెడ్డి, రాజా, రామకృష్ణ, శివ, రవి, శ్రీరాములు, రామచంద్రయ్య, చలపతి, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరులో ఘనంగా లెనిన్ వర్ధంతి వేడుకలు

కామ్రేడ్ లెనిన్ సేవలను కొనియాడిన వక్తలు

విశాలాంధ్ర -చిత్తూరు:శ్రామికుల కోసం, కార్మికుల కోసం, అట్టడుగు వర్గాల కోసం సోవియట్ వ్యవస్థ కోసం, సమ సమాజం నిర్మాణ కోసం శ్రమించిన మహా పురుషుడు కామ్రేడ్ ఐ వి లెనిన్ అని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం నగరంలోని నగరంలోని లెనిన్ కాలనీలో లెనిన్ వర్ధంతి వేడుకలు సిపిఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు .ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన చిత్తూరు మాజీ ఎమ్మెల్యే గోపీనాథ్ తనయుడు వైసిపి నేత భూపేష్ పాల్గొని కామ్రేడ్ లెనిన్ గారి చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పిస్తూ కామ్రేడ్ లెనిన్ శ్రామికుల కోసం ,కార్మికుల కోసం, అట్టడుగు వర్గాల ప్రజల కోసం, సమ సమాజ స్థాపన కోసం అహర్నిశలు కృషిచేసిన విప్లవ నాయకుడు కామ్రేడ్ లెనిన్ ని కొనియాడారు. కామ్రేడ్ లెనిన్ మరణించి 100 సంవత్సరాలు కావస్తున్న ఇప్పటికీ అతని ఆశయాలను, సిద్ధాంతాలను కొనసాగిస్తూ ప్రజల కోసం నిరంతరం పనిచేస్తున్న కార్యకర్తలను ఈ సందర్భంగా భూపేష్ అభినందించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్ .నాగరాజు, పార్టీ సీనియర్ నాయకులు కే.మనీ, నగర కార్యదర్శి వి .సి. గోపీనాథ్, ఎ.పి.మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి కె. విజయ గౌరీ , ఏఐటియుసి నగర కార్యదర్శి దాసరి చంద్ర, ఏఐటీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే రమాదేవి, మాజీ మునిసిపల్ కౌన్సిలర్ విజయ్ కుమార్ , కోమల,లతా రెడ్డి, గజేంద్ర బాబు, చాంద్ బాషా, కాంతమ్మ, కళ, రాజేంద్ర, వినాయక, కార్తీక్, భార్గవ్, సుబ్రహ్మణ్యం, బషీర్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

తేగలు బలే రుచి -ఆరోగ్యానికి ఔషధం లాంటివి

విశాలాంధ్ర - బుచ్చినాయుడు కండ్రిగ : ఆహా ఏమి రుచి తినరా మైమరచి రోజు తిన్నా మరి మోసే తీరనిది అంటూ చిన్న పెద్దలు వయసుతో సంబంధం లేకుండా తాటి తేగలు తెగ కొనుగోలు చేస్తూ భుజిస్తున్నారు. మండల కేంద్రంతో పాటు గ్రామీణ ప్రాంతాలలో విరివిగా తాటి తేగలు వ్యాపారం బలే జోరుగా కొనసాగుతున్నది. చేయగల ప్రయోజనాలు ఆరోగ్యానికి సమకూరుస్తున్నాయి తదితర గ్రామాల్లో తేగల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఈ సీజన్‌లో తేగలను కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు.తేగలు బాగా ఊరటంతో పాటు రుచిగా ఉండటం ఇక్కడ ప్రత్యేకత. సత్య వేడు నియోజకవర్గంలో సుమారు అనేక కుటుంబాలు ఏటా ఈసీజన్‌లో తేగల విక్రయాలతో ఉపాధి పొందుతున్నారు. సెప్టెంబర్ నుంచి జనవరి వరకు తేగల విక్రయాలు జోరుగా సాగుతాయి. పెద్ద సైజు తేగల కట్ట రూ.50 నుంచి రూ.100, చిన్న సైజు తేగల కట్ట రూ.20 వ్యాపారులు విక్రయిస్తున్నారు. తేగల ధర అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండటంతో ఎక్కువ మంది కొనుగోలు చేస్తున్నారు. తడ సూళ్లూరుపేట ప్రాంతాల ఎక్కువ శాతం ఇసుక రేగడి నేలలు కావడంతో తేగలు విరివిగా దొరుకుతాయి, ఈ ప్రాంతపు వారు రాకపోకలు కొనసాగిస్తున్న ట్రైన్లలో ఉపాధి పొందుతున్నారు. మండలంలో కాళింగి నదీ ప్రవాహ ప్రాంతపు ప్రజలు నది పక్కన 'తాటి పండ్లను వాటి ముట్టులు' మెత్తటి ప్రాంతంలో పూడ్చి పెడుతారు అవి తేగలు గా మారుతాయి.చలికాలం తాటి తేగలు విరివిగా దొరుకుతాయి, సంక్రాంతి పండుగలకు వచ్చిన బంధువులు కొత్త అల్లుళ్లు కొత్త కోడలు వారి గృహాలకు తేగలు తీసుకువెళ్తారు అందరికీ చుట్టుపక్కల ప్రాంతాల వారికి పంచుతారు. అయితే తప్పక తెలుసుకోవాల్సిన విషయాలు చలికాలం వచ్చిందంటూ చాలు తాటి తేగలను మార్కెట్‌లో ఎక్కువగా అమ్ముతుంటారు. తాటి టెంకలు నాటితే వచ్చే మొలకలను తేగలు అని పిలుస్తుంటారు. వీటిని పల్లెటూరు ప్రజలు తాటి పండ్లను ఎక్కువగా మట్టిలో పూడుస్తారు. అవి తేగలుగా మారాక భూమి నుంచి తీసిన తాజా తేగలను ఉడకబెట్టుకుని లేదా కాల్చుకుని ఇష్టంగా తింటుంటారు. ప్రస్తుతం ఇవీ పట్టణాల్లో కూడా కనిపిస్తున్నాయి. చిన్నా పెద్ద తేగలు అందుబాటులో ఉన్నంత వరకు తింటూనే ఉంటారు. అయితే వీటిని తినడం వల్ల ఆరోగ్యానికి మంచిదని వైద్యులు చెబుతున్నారు. ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయో ఇక్కడ తెలుసుకుందాం.తాటి తేగల్లో విటమిన్లు, పొటాషియం, ఫాస్ఫరస్, మెగ్నీషియం, ఐరన్ పుష్కలంగా ఉండి అనారోగ్య సమస్యలను తరిమి కొడతాయి.తెల్ల రక్త కణాల సంఖ్యను పెంచడంతో పాటు రోగనిరోధక శక్తిని పెంచుతాయి.వీటిని మధుమేహ వ్యాధిగ్రస్తులు తీసుకుంటే చక్కెర స్థాయిలో అదుపులో ఉంటాయి.అలాగే ఇటీవల కాలంలో చాలా మంది అధిక బరువుతో బాధపడుతున్నారు. అలాంటి వారికి తాటి తేగలు మంచి ఎంపిక. తాటి తేగలు జీర్ణ సమస్యలను తగ్గేలా చేయడమే కాకుండా ఎముకల బలాన్ని పెంచుతాయి. అలా అని అధికంగా తినడం వల్ల కడుపునొప్పి వంటి సమస్యలు వస్తాయి. కాబట్టి మోతాదుగా తీసుకోవడం మంచిది. మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఔషధంలా పనిచేస్తుందని సమాచారం.

జిల్లా పోలీస్ స్పోర్ట్స్ గేమ్స్ మీట్ ప్రారంభం

క్రీడాస్ఫూర్తితో ఆడాలి: ఎస్పీ

విశాలాంధ్ర -చిత్తూరు : జిల్లా పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ ను జిల్లా ఎస్పీ రిశాంత్ రెడ్డి ఆదివారం ఉదయం చిత్తూరులోని జిల్లా పోలీస్ క్రీడా మైదానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూఫిజికల్ ఫిట్ నెస్ కు, మానసిక ఉల్లాసానికి క్రీడలు చాలా అవసరం అన్నారు ముందుగా కపోతాలను, బెలూన్ లను ఎగురవేసి కాగడా వెలిగించి లాంఛనంగా క్రీడా పోటీలను ప్రారంభించారు. క్రీడాకారుల మార్చ్ పాస్ట్ ను తిలకించి జిల్లాలోని చిత్తూరు, పలమనేరు, నగరి సబ్ డివిజన్ ల తో పాటు ఆర్మ్డ్ రిజర్వు విభాగ క్రీడాకారుల జట్లను పరిచయం చేసుకున్నారు. అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ నిత్యం విధి నిర్వహణలో సతమతమయ్యే పోలీస్ సిబ్బందికి మానసిక ఒత్తిడి నుండి ఉపశమనం కలిగించి వారిలో నిఘూడమై వున్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీయాలనే లక్ష్యంతో అలాగే స్పోర్ట్ మనలోని టాలెంట్ ను బయట పెడుతుందని, ఈ ఉద్దేశంతో క్రీడలను ప్రారంబించామని, క్రీడలలో పాల్గొనే ప్రతి ఒక్కరు స్పోర్ట్ ను టీం వర్క్ గా పాజిటివ్ గా తీసుకొని ఆడాలని, అంతేకాకుండా స్పోర్ట్ వలన మీరు వ్యక్తి గతంగా కూడా ఎదగడానికి దోహద పడుతుందని ముఖ్యంగా వి.ఐ.పి, వి.వి.ఐ.పి వలన ఎక్కువ డ్యూటీ లు ఉంటాయని దాని వలన ప్రతి ఒక్కరు ఎంతో మానసిక ఒత్తడికి లోనై వుంటారని, ఇలాంటి స్పోర్ట్ వలన అందరము ఆ ఒత్తిడి నుండి బయట పడవచ్చని తెలియజేసారు. అథ్లెటిక్స్, టెన్నిస్, బాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, టగ్ అఫ్ వార్ తో పాటు పలు అంశాలలో క్రీడలు జరుగనున్నాయన్నారు. గెలుపోటములు ముఖ్యం కాదని, క్రీడల్లో పాల్గొని తమలోని ప్రతిభను ప్రదర్శించి క్రీడాస్ఫూర్తి తో గెలుపోటములను స్వీకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎల్.సుధాకర్, అడిషనల్ ఎస్.పి. శ్రీలక్ష్మి, ఏ.ఆర్. అడిషనల్ ఎస్పీ జి.నాగేశ్వర రావు, ఎస్.బి. డి.ఎస్.పి. శ్రీనివాస రెడ్డి, మూడు సబ్ డివిజన్ పరిధిలోని డీఎస్పీలు, సిఐలు ఎస్సైలు , సిబ్బంది పాల్గొన్నారు .

అయోధ్యలో టీటీడీ ఛైర్మన్ భూమన

రాముని విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొననున్న కరుణాకరరెడ్డి

విశాలాంధ్ర - తిరుమల : అయోధ్యలో జనవరి 22వ తేదీ సోమవారం జరగనున్న రామమందిర ప్రారంభోత్సవం లో పాల్గొనడానికి టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఆదివారం అయోధ్యకు చేరుకున్నారు. ఎర్రటి దుస్తులు ధరించి నుదుటిన శ్రీరామ నామం , నామాలతో సాంప్రదాయ బద్ధంగా అయోధ్య శ్రీ రామమందిరం వద్దకు చేరుకున్న కరుణాకరరెడ్డి రామమందిర ట్రస్టు ప్రతినిధి సాధ్వి రితంబరి సాదర స్వాగతం పలికారు. అనంతరం కరుణాకరరెడ్డి రామాలయాన్ని సందర్శించి అక్కడ జరుగుతున్న ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. రామమందిర ప్రారంభ సంబరం లో పాల్గొనడానికి వచ్చే భక్తులకు పంపిణీ చేయడానికి తిరుమల శ్రీవారి ఆలయంలో ప్రత్యేకంగా తయారు చేసిన లక్ష లడ్డూలను ఛైర్మన్ కరుణాకరరెడ్డి రామ మందిర ట్రస్టు ప్రతినిధులకు అందజేశారు. ఆంధ్రప్రదేశ్ తో పాటు వివిధ రాష్ట్రాల నుండి అయోధ్యకు చేరుకున్న కళాకారులు, విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులతో ఛైర్మన్ కరుణాకరరెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా కరుణాకరరెడ్డి మీడియాతో మాట్లాడారు. కలియుగంలో తిరుమలలో స్వయం భువుగా వెలసిన శ్రీ వేంకటేశ్వర స్వామి వారే త్రేతాయుగంలో శ్రీ రామచంద్ర మూర్తి అని చెప్పారు. శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ప్రథమ సేవకుడిగా ఉన్న తనకు రామమందిర ప్రారంభ మహోత్సవంలో పాల్గొనే అదృష్టం దక్కడం పూర్వజన్మ సుకృతమని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. అయోధ్యలో రామాలయ నిర్మాణానికి సహకరించిన వారికి, ఆలయ ప్రారంభ మహోత్సవంలో పాల్గొంటున్న భక్తులందరికీ శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆశీస్సులు ఉండాలని ఛైర్మన్ ప్రార్థించారు. రామాలయం భక్తజనంతో విరాజిల్లాలని ఆకాంక్షిస్తున్నట్లు కరుణాకర రెడ్డి పేర్కొన్నారు.

నల్లారి కిషోర్ సమక్షంలో టీడీపీలో భారీగా చేరికలు

విశాలాంధ్ర-పీలేరు: -పీలేరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి సమక్షంలో కె.వి పల్లి మండలం నూతనకాలువ పంచాయతీకి చెందిన సూర్యప్రకాష్ రెడ్డి,గర్నిమిట్ట గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ నల్లపరెడ్డి హరినాథ్ రెడ్డి, మోటుపల్లివాండ్లపల్లి గ్రామానికి చెందిన అమరనాథ్ రెడ్డి,పీలేరు మండలం, తలుపుల గ్రామానికి చెందిన ఏ.వి.నాగిరెడ్డి మరియు పి.వెంకటరమణలతో పాటు సుమారు 500 కుటుంబాలు టీడీపీలో చేరారు. వారందరిని నల్లారి కిషోర్ టీడీపీ కండువా వేసి తెలుగుదేశం పార్టీలోకి సాధారంగ ఆహ్వానించారు. అంతకు ముందు పీలేరు, కేవీ పల్లి మండలాల్లో ప్రజలు అభిమానులు పులహారాలు, మంగళ హారతులతో,బాజా భజంత్రీలతో ఘనస్వాగతం పలికారుఈ సందర్భంగా నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి మాటలాడుతు వైసీపీ ప్రభుత్వంతో ప్రజలు విస్తుపోయారని, టీడీపీ ప్రవేశపెట్టిన తొలి మేనిఫెస్టోలో సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని,వచ్చేది టీడీపీ ప్రభుత్వమేనని, అందరు కలసి కట్టుగా పీలేరు నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగురా వేయాలని ఆకాంక్షిచారు.టీడీపీ లో చేరే వారు చేరవచ్చునని, నల్లారి కిషోర్ ను నమ్ముకున్న వారికీ ఎప్పటికి తమ గుండెల్లో ఉంటారని, వారికీ ప్రత్యేకంగా గుర్తింపు ఉంటుందని తెలిపారు.తెలుగుదేశంపార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం కల్పించి గ్రామాల్లో తమ సమస్యలకు పరిష్కార మార్గం చూపుతానని అన్నారు.వచ్చే ఎన్నికల్లో కష్టపడి పనిచేయండి అందుబాటులో ఉంటాను అందరికి గౌరవం, మర్యాద, గుర్తింపుఉంటుందని అన్నారు.రాష్ట్రంలో వైకాపా నాయకులు కులాలు, మతాలు, ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే మంటలో చలికాంచు కొంటున్నారని,రాష్ట్రంలో వ్యవస్థలను సర్వనాశనం చేశారని, ఆర్భాటాలు, హంగులు తప్ప చేసేదేమీ లేదన్నారు. పీలేరు నియోజకవర్గంలో గెలుపే లక్ష్యంగా,తన పదునైన రాజకీయ వ్యూహంతో బలమైన అస్త్రాన్ని ఉపయోగిస్తూ అందరితో మమేకమై ముందుకు దూసుకు పోతున్నారు. అంతే కాకుండా తనదైన శైలిలో కార్యకర్తలతో కలిసి అభిమానుల్ని ఆకట్టుకొంటు న్నారు.పీలేరు నియోజకవర్గంలోని ఎదురులేని నాయకుడిగా చరిత్ర సృష్టించ బోతున్నారు. ఓడిపోవడం ఓటమి కారణం కాదని గెలుపుకు తొలి మెట్టు అంటూ నిరూపించ బోతున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ,రాజంపేట పార్లమెంట్ పరిధి పీలేరులో ఈ నెల27న చంద్రబాబు చేపట్టే రా.. కదలిరా.. కార్యక్రమంతో నియోజకవర్గంలో వరుస వలసలతో టీడీపీ పుంజుకొం టుంది.అ క్రమంలోనే టీడీపీ జనసేన పొత్తుతో రాష్ట్రంలో ప్రభంజనం సృషించి, విజయం సాధించ బోతున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు మల్లారపు రవిప్రకాష్ నాయుడు,పీలేరు టీడీపీ శ్రేణులు, నాయకులు,కెవి.పల్లి మండల టీడీపీ యువ నాయ కులు, రాజంపేట నియోజకవర్గ కార్యవర్గ కార్యదర్శి, యంగ్ డైనమిక్ స్టార్, ప్రముఖ పారిశ్రామిక వేత్త కుప్పం రవిచంద్రా రెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, నల్లారి కిషోర్ అభిమానులు పాల్గొన్నారు.

సామాజిక సాధికారిక యాత్ర విజయవంతం

విశాలాంధ్ర-నాయుడుపేట: నాయుడుపేట పట్టణపరిధిలో ఆదివారం కొనసాగిన సామాజిక సాధికారిక యాత్ర సూపర్ సక్సెస్ అయింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఒకరికి మించి ఒకరు పోటీలు పడి, జనసమీకరణ చేయడంతో పట్టణ వీధులన్నీ వైసీపీ కార్యకర్తలతో నిండిపోయాయి. సంజీవయ్యకు టికెట్ ఇవ్వవద్దంటూ గత కొన్ని రోజులుగా వ్యతిరేకవర్గం గట్టిగా పట్టుబడుతున్న నేపథ్యంలో కామిరెడ్డి సోదరులు సత్యనారాయణరెడ్డి,రాజారెడ్డి ఆధ్వర్యంలో నాయుడుపేట పరిసర గ్రామాల నుంచి భారీగా జనసమీకరణ చేశారు.స్థానిక విజయ గణపతి గుడి వద్ద నుంచి ప్రారంభమైన ఈయాత్ర నాయుడుపేట గ్రామ దేవత పోలేరమ్మ తల్లి,వెల్కమ్ సెంటర్,గవర్నమెంట్ హాస్పిటల్ మీదుగా పాత బస్టాండ్ వద్ద ఏర్పాటుచేసిన సభాస్థలి వరకు కొనసాగింది. ఈసమావేశంలో మాజీ మంత్రి అనీల్ యాదవ్ మాట్లాడుతూ,ఇచ్ఛాపురం నుండి తడ వరకు సామాజిక సాధికారిక యాత్ర విజయవంతం గా సాగుతోంది అనిఅన్నారు.సూళ్లూరుపేట ఎమ్మెల్యే అభ్యర్థి గా ముచ్చటగా మూడోసారి సంజీవయ్య ను 75 వేల ఓట్లు మెజారిటీ తో మీరందరూ గెలిపించాలని కోరారు.రాష్ట్రంలో ఎస్సీ,ఎస్టీ,బీసీ లకు ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని అన్నారు. 400 కోట్ల రూపాయల వ్యయంతో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు దీన్ని చూసి ఓర్వలేక చంద్రబాబు నాయుడు లేని పోనీ విమర్శలు చేస్తున్నారని తెలిపారు.మా ఆడబిడ్డను అడ్డం పెట్టుకుని వెధవరాజకీయాలు చేస్తున్నారు అని అన్నారు.స్వాతంత్ర్యం వచ్చి ఎన్ని సంవత్సరాలులో నెల్లూరు జిల్లాలో బీసీ మంత్రి ని చేసింది ఒక్క జగన్మోహన్ రెడ్డి మాత్రమేనని అన్నారు. తిరుపతి జిల్లా వైసీపీ అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రతి పేదవాడి ఇంటి తలుపులు తెరిచి పెన్షన్ ఇస్తున్న ఏకైక ముఖ్యమంత్రి ఒక్క జగన్నన అనిఅన్నారు. తిరుపతి పార్లమెంట్ సభ్యులు గురుమూర్తి మాట్లాడుతూ, సంక్షేమానికి సరికొత్త అర్థం చెప్పిన నాయకులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని అన్నారు

అంబేడ్కర్ ఆశయాలు దేశానికి ఆదర్శం

- విగ్రహావిష్కరణ సభలో ఎమ్మెల్యే నవాజ్ బాషా

విశాలాంధ్ర-మదనపల్లి : బాబాసాహెబ్ అంబేడ్కర్ విశ్వ విజ్ఞాని అని, అయన భారతదేశంలో జన్మించడం యావత్ భారత జాతికీ గర్వకారణం అని, మదనపల్లె ఎమ్మెల్యే నవాజ్ బాషా స్పష్టం చేశారు. ఆదివారం మదనపల్లి రూరల్ మండలం వేంపల్లి ఎస్సీ కాలనీ నందు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ విగ్రహావిష్కరణ మహోత్సవం అత్యంత ఘనంగా జరిగింది. భారతీయ అంబేడ్కర్ సేన (బాస్) తోకలిసి వేంపల్లి ఎస్సీ కాలనీ వాసులు ఈ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేసిన ఎమ్మెల్యే నవాజ్ బాషాకు బెంగళూరు రోడ్డులోని కర్ణాటక సరిహద్దు వద్ద మేళతాలాలతో ఘన స్వాగతం పలికి అక్కడి నుండి వేంపల్లి ఎస్సీ కాలనీ వరకూ భారీ బైకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సభికుల హర్ష ద్వానాల మధ్య డి.ఎస్.పి కేశప్ప, బాస్ వ్యవస్థాపకుడు పీటీయం శివప్రసాద్, రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శేఖర్, విగ్రహ కమిటీ ఛైర్మన్ చాట్ల బయన్న, బాస్ కోశాధికారి నీరుగట్టి రమణ, వైసీపీ నాయకుడు చీకిలబైలు బాబురెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే నవాజ్ బాషా అంబేడ్కర్ నిలువెత్తు విగ్రహాన్ని ఆవిష్కరించి, ఘనంగా నివాళులు అర్పించారు. కన్నుల పండుగలా జరిగిన ఈ వేడుక చూసి గ్రామస్తులు పులకించిపోయారు. జైభీమ్ నినాదాలతో సభా ప్రాంగణం మార్మోగింది. ఈసందర్భంగా విగ్రహ కమిటీ ఛైర్మన్ చాట్ల బయన్న అధ్యక్షతన జరిగిన అంబేడ్కర్ విగ్రహావిష్కరణ మహోత్సవ సభలో ఎమ్మెల్యే నవాజ్ బాషా మాట్లాడుతూ వేల సంవత్సరాలనుండి దేశంలో కొనసాగుతున్న అసమానతలు రూపుమాపే దివ్య ఔషదం లాంటి గొప్ప రాజ్యాంగాన్ని అంబేడ్కర్ మన దేశానికి అందించారని, పాలకులు, ప్రజలు రాజ్యాంగ సూత్రాలకు కట్టుబడి జీవిస్తే మన దేశం అత్యున్నత స్థాయికి చేరుకుంటుందని చెప్పారు. అంబేడ్కర్ దేశానికి చేసిన సేవలకు భారత జాతి ఎప్పటికీ రుణపడి ఉంటుందని తెలిపారు. విగ్రహ కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు.

అనంతరం డిఎస్పీ కేశప్ప మాట్లాడుతూ అంబేడ్కర్ దళితుల నాయకుడు అన్న దురభిప్రాయం చాలా మందిలో ఉందని, అది చాలా తప్పని, అంబేడ్కర్ అందరివాడని స్పష్టం చేశారు. దేశం కోసం తన సర్వస్వాన్నీ త్యాగం చేసిన అంబేడ్కర్ ను ప్రతీ భారతీయుడు గౌరవించాల్సి ఉందని చెప్పారు. అయన రాసిన రాజ్యాంగం దేశానికి వెలుగు నిస్తున్న దివిటీ లాంటిదని కీర్తించారు. పి.టి.యం శివప్రసాద్ మాట్లాడుతూ రెండో ప్రపంచ యుద్ధం తర్వాత సర్వం కోల్పోయిన మన దేశానికి పునాదుల నుండి మరమ్మత్తులు చేసిన మేదో తరంగం అంబేడ్కర్ అన్నారు. వ్యవసాయం వృద్ధికి అవసరమైన భారీ నీటి ప్రాజెక్టులను, విద్యుత్ గ్రిడ్ వ్యవస్థను రూపొందించి, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసి, దేశ ప్రజల ఆకలి తీర్చిన మహా ప్రతిభా శాలి అంబేడ్కర్ అని చెప్పారు. ఆర్.బి.ఐ ఏర్పాటు నుండి భారత రాజ్యాంగ నిర్మాణం దాకా అయన దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమైనవని చెప్పారు. దేశ ప్రజలకు అంబేడ్కర్ తల్లిలాంటి వాడని, అయన ప్రవచించిన ప్రేమ సిద్ధాంతం ఇప్పుడు ప్రపంచమంతా స్వాగతిస్తోందని చెప్పారు. అంబేడ్కర్ చూపిన మార్గంలో నడిస్తే దేశ ప్రజలు ఎంతో మానసిక వికాసాన్ని పొంది, ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని అయన చెప్పారు. ఈకార్యక్రమంలో వైకాపా నాయకులు బాబురెడ్డి, బోర్ వెల్ వెంకటేష్, నారాయణ రెడ్డి, వేంపల్లి సర్పంచ్ సువారపు అదేమ్మ, ఎం.పి.టి.సి సుభాషిణి, కౌన్సిలర్ రేణుకమ్మ లతోపాటు విగ్రహ కమిటీ సభ్యులు బండ వెంకటరమణ, బైనేని సురేష్, చాట్ల కళ్యాణ్, సీకిపల్లి రెడ్డి, నరేష్, బాబు, జయప్రకాశ్, వెంకటేష్, బాస్ నాయకులు బురుజు లక్ష్మీనారాయణ, రెడ్డిప్రసాద్, రాయల్ సూరి, శశి కుమార్, టి.ఎ. పీర్ బాషా, కోటూరి రత్నం, సొన్నికంటి రెడ్డెప్ప, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

గుండె నిండా ధైర్యం నింపుతున్నారు

అండగా ఉంటామని భరోసా ఇస్తున్నారు

ఆత్మీయ కలయిక కార్యక్రమంలో బడి సుధాయాదవ్

విశాలాంధ్ర -తిరుపతి రూరల్ : చంద్రగిరి నియోజకవర్గ వ్యాప్తంగా ఆత్మీయ కలయిక పేరుతో ఒబిసి ఫోరం కన్వీనర్ బడి సుధాయాదవ్ చేపట్టిన కార్యక్రమం దిగ్విజయంగా కొనసాగుతుంది. ఆదివారం మంగళం, బిటిఆర్, రణధీర్ పురం, కుంట్రపాకం పంచాయితీల్లో పర్యటించిన ఆయన సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని పార్టీలకు అతీతంగా ముఖ్య నేతలకు నూతన సంవత్సర క్యాలెండర్, స్వీట్స్ పంపిణీ చేశారు. ఎక్కడా పర్యటిస్తున్న పార్టీలకు అతీతంగా గుండె నిండా ధైర్యం నింపుతున్నారని అన్నారు. తెలుగుదేశం పార్టీ టిక్కెట్ కేటాయిస్తే అండగా ఉంటామని భరోసా ఇస్తున్నట్లు బడి సుధాయాదవ్ తెలిపారు. అలాగే నియోజకవర్గంలో సర్పంచులు, ఎంపీటీసీలు చూపిస్తున్న ఆదరణ నా అదృష్టంగా భావిస్తున్నానని



తెలిపారు. నియోజకవర్గాన్ని రాష్ట్రానికి రోల్ మోడల్ గా తీర్చిదిద్దగల సత్తా ఉందని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించి క్షేత్ర స్థాయిలో సమస్యలపై అధ్యయనం చేస్తానని చెప్పారు. అలాగే బడి ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తానని అన్నారు.

వరదయ్యపాలెంలో టీడీపీ జయహో బీసీ

విశాలాంధ్ర - వరదయ్యపాలెం :వరదయ్యపాలెం మాజీ సర్పంచ్ పన్నెం బాలసుందరం ఇంటి వద్ద జయహో బీసీ కార్యక్రమంను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాజీ టీడీపీ ఎమ్మెల్యే హేమలత, టీడీపీ ఇంచార్జి డాక్టర్ హెలెన్, మాజీ తుడా చైర్మన్ నరసింహ యాదవ్ పాల్గొన్నారు.బీసీ లు పడుతున్న బాధలు,వాటిని పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం అయిందని తెలిపారు. రాష్ట్రములో బీసీలపై జరిగిన దాడులను వివరించారు.బీసీలకు కుల కార్పొరేషన్ లు ఏర్పాటు చేసి,ఆ కార్పొరేషన్ కు నిధులు ఎంతెంత మంజూరు చేశారో మనకు బాగా తెలుసని చెప్పారు. పెద్ద పెద్ద బోర్డులు వేసుకుని కార్లకు తగిలించుకోవడానికి తప్ప,కార్పొరేషన్ ల వలన ఏమి ఒరిగింది అని అన్నారు.చేతి వృత్తుల వారిని ఆదుకోవడలో టీడీపీ ఎప్పుడు ముందుగా ఉంటుందని అన్నారు.ఇలాంటి సమస్యలఅన్ని పరిష్కారం కావాలి అంటే,బీసీలు అభివృద్ధి చెందాలి అంటే తప్పకుండ టీడీపీని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని నొక్కి వక్కానించారు.కొత్తగా తీసుకు వచ్చిన భూ హక్కు చట్టాన్ని తీసుకురావడం పట్ల రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు వ్యక్తం చేస్తున్నారని,భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో బీసీ నాయకులతో పాటు ముఖ్య నియోజకవర్గ స్థాయి నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా లెనిన్ వర్ధంతి

విశాలాంధ్ర -పాకాల : కామ్రేడ్ లెనిన్ వర్ధంతిని ఆదివారం పాకాల పట్టణంలో కుల వివక్ష పోరాట సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. లెనిన్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. పేదరిక నిర్మూలనకై ఆయన చేసిన కృషిని కొనియాడారు . దోపిడీ విధానాన్ని అరికట్టి సమసమాజ స్థాపన కై సమాజంలో మార్పులు తీసుకురావడానికి లెనిన్ ఎనలేని కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు మధుసూధనరావు, మండల అధ్యక్షులు నరేంద్ర , ఉపాధ్యక్షులు దొరస్వామి , ఉమాపతి ప్రధాన కార్యదర్శి రవి సహాయ కార్యదర్శులు హరి ప్రకాష్ ,ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య శ్రీరామ అక్షింతలు పంపిణీ

విశాలాంధ్ర-కోట: కోట మండలం వెంకన్నపాలెం పంచాయతీలో ఆదివారం బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పనబాక కోటేశ్వరరావు అయోధ్య రాముని అక్షింతలు ఇంటింటికి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 22వ తేదీన అయోధ్యలో శ్రీరాముని ప్రాణప్రతిష్ట మహోత్సవ సందర్భంగా స్వామివారి అనుగ్రహం పొందడానికి అయోధ్యలో బాలరామునికి అర్చన చేసి అక్షింతలను దేశంలోనే కాకుండా విశ్వవ్యాప్తంగా ఉన్న ప్రతి హిందువు ఇంటికి చేర్పించాలని ఉద్దేశంతో శ్రీరామ జన్మభూమి ట్రస్ట్ వారు అక్షింతలు పంపించడం జరిగిందన్నారు. ఈనెల 22వ తేదీ ప్రతి ఇంటిలో 5దీపాలు వెలిగించి పూజ చేసి స్వామివారి అనుగ్రహం పొందాలన్నారు.అలాగే అక్షింతలు పెద్దవారు చిన్నవారికి వేసి ఆశీర్వదించాలన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు దిగుపోకలవారిపల్లెలో శ్రీరామ కోటి భజన ఉత్సవాలు

విశాలాంధ్ర -పులిచెర్ల- కల్లూరు: పులిచెర్ల మండలం దిగువ పోకలవారిపల్లెలో సోమవారం శ్రీరామ కోటి భజన ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ పోకల ఉమాదేవి గంగయ్య తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అయోధ్యలో శ్రీరామ మందిరం విగ్రహ ప్రాణ ప్రతిష్ట సందర్భంగా ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు రామకోటి భజన ఉత్సవాలు నిర్వహిస్తున్నామని అన్నారు. 500 సంవత్సరాల కలను నిజం చేసుకున్న సందర్భంగా సోమవారం హిందువుల పండుగ దినంగా ఈ రామకోటి భజన ఉత్సవాలకు మండలంలో ప్రతి ఒక్కరూ ఉత్సవాలలో పాల్గొని జైశ్రీరామ్, జైశ్రీరామ్ అంటూ స్వామివారి కృపకు పాత్రులు కావాలని తెలిపారు.

వైసిపి సూళ్లూరుపేట అభ్యర్థి సంజీవయ్యే

విశాలాంధ్ర - నాయుడుపేట : నాయుడుపేట నందు ఆదివారం నిర్వహించిన సామాజిక సాధికార యాత్ర లో పాల్గొన్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దక్షిణ కోస్తా జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ వేణుంబాక విజయసాయిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ సూళ్లూరుపేట వైసిపి అభ్యర్థి స్థానిక శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య అని తేల్చి చెప్పారు.ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అభీష్టం మేరకు ఈనిర్ణయం తీసుకున్నట్టు తెలియజేశారు.సోమవారం నుంచి సంజీవయ్యకు,పార్టీకి వ్యతిరేకంగా ఎవరు ఆత్మీయ సమావేశాలు నిర్వహించిన వారిపై చర్యలు తీసుకుంటామని తెల్చిచెప్పారు. సంజీవయ్యకు వ్యతిరేకంగా ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేసిన కట్టా సుధాకర్ రెడ్డి,షేక్ రఫీ,కలతూరు రామ్మోహన్ రెడ్డి, కలతూర్ జనార్దన్ రెడ్డి, సులూరుపేట మున్సిపల్ చైర్మన్ దెబ్బల శ్రీమంత్ రెడ్డి, కళత్తూరు శేఖర్ రెడ్డి ఇకపై పార్టీకి అనుకూలంగా నలుచుకోవాలని లేనిచో వారిపై చర్యలు తప్పవని విజయసాయిరెడ్డి తెలియజేశారు. దీంతో సంజీవయ్య అభిమానులు ఆనంద డోలికలలో మునిగిపోయారు.

తెలుగు యువత ఆధ్వర్యంలో
వాలీబాల్ పోటీలు

విశాలాంధ్ర-వెంకటగిరి: డక్కిలి మండలం, దేవుడు వెల్లంపల్లి పంచాయితీ, కుప్పాయపాలెం నందు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు ఇంచార్జీ కురుగొండ్ల రామకృష్ణ ఆదేశానుసారం మండల యువత అధ్యక్షులు వేముల కిషోర్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా వాలీబాల్ పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా గెలుపొందిన వారికి, అదే విధంగా పాల్గొన్న ప్రతి ఒక్కరికి ముఖ్య అధితిలుగా రాష్ట్ర యువత ప్రధాన కార్యదర్శి రవినాయుడు, తిరుపతి పార్లమెంట్ యువత అధ్యక్షులు అక్షింతల కృష్ణ యాదవ్, రాష్ట్ర యువత కార్యదర్శి కెవికె ప్రసాద్, మండల అధ్యక్షులు పోలంరెడ్డి కోటేశ్వర రెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యులు ఏలేశ్వరం రామచంద్రయ్య గార్లు బహుమతులు అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ వాణిజ్య విభాగ కార్యదర్శి వేముల తిరుపాల్ నాయుడు, డక్కిలి మండల సీనియర్ నాయకులు చెలికం భాస్కర్ రెడ్డి, వెంకటయ్య, మూర్తి, నాయకులు

సెబ్ చే బహు బాషా కార్యక్రమాలు

విశాలాంధ్ర - తిరుపతి రూరల్ : ఆసియాలో మొట్టమొదటి లిస్టెడ్ డిపాజిటరీ అయిన సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ (ఇండియా) లిమిటెడ్ (సీడీఎస్ల్), రెండు ప్రత్యేకమైన బహుభాషా కార్యక్రమాలను ప్రారంభించినట్లు సెబీ చైర్పర్సన్ మాధబి పూరి బుచ్, సీఈఓ నేహాల్ ఓరా తెలిపారు. ఆ సంస్థ రజతోత్సవ సంవత్సరాలు పురస్కరించుకొని వారు మీడియాతో మాట్లాడుతూ 25 సంవత్సరాలుగా వినియోగదారుల మన్నలను పొందుతూ ముందుకెళు తున్నామన్నారు. మా సంస్థ ద్వారా కొత్తగా ఆవిష్కరించబడిన ఇంక్లూజివిటీ కీలక మైలురాయిగా నిలుస్తాయి అన్నారు. దేశవ్యాప్తంగా మా సంస్థను విస్తరించాలని ఉద్దేశంతో బహు భాషల్లో మా సంస్థ కీర్తిని ప్రచారం చేస్తున్నామన్నారు.

38 ఏళ్ల తర్వాత అపూర్వ కలయిక

విశాలాంధ్ర-గంగాధర నెల్లూరు : మండలంలోని తూగుండ్రం హైస్కూల్లో 1985- 86 10వ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం తూగుండ్రం జడ్పీ హైస్కూల్ ఆవరణలో 38 ఏళ్ల తర్వాత ఒకటయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు దొ రైరాజ్ ,కృష్ణన్, దేవరాజులు నాయుడు, రామానాయుడు, మాధవన్, మోహన్ పిళ్ళై ,మనోహర్ లకు పూలమాలలు వేసి శాలువులతో ఘనంగా సన్మానం చేశారు. అనంతరం టీచర్ల పాదాలకు పూజలు చేసి పూర్వ విద్యార్థులు నమస్కరించి తమ గురుభక్తిని చాటుకున్నారు పూర్వ విద్యార్థుల ఒకరినొకరు పలకరించుకొని పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ కలయిక ముఖ్య కారకులైన రాజేంద్ర నాయుడు, నటరాజ్ మొదలి, ఏకాంబరరెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, షబ్బీర్అలీ, శ్రీనివాసులు మొదలి, సత్యమూర్తి, బాలక్రిష్ణారెడ్డి, జగదీష్ నాయుడులు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో టీచర్ లు దేవరాజులు మందడి, హేమ, గుణశేఖర్ నాయుడు, రిటైర్డ్ టీచర్ లు కమ్మరల్లీ, ఆర్ముగం పిళ్లై పాల్గొన్నారు.

జాతీయ ఉపకార వేతనాలకు 4 గురు విద్యార్థులు ఎంపిక

విశాలాంధ్ర -పులిచెర్ల- కల్లూరు:- పులిచెర్ల మండలం కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 4గురు విద్యార్థులు జాతీయ ఉపకార వేతనాలకు ఎంపికైనట్లు హెచ్ఎం శ్రీవాణి తెలిపారు. పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థులు గౌతమి, మేఘన, హేమ, ఫాదీల్ ఎంపికయ్యారని హెచ్ఎం తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఎంఈఓ లు సిద్ధరామయ్య ,పోకల తాతయ్య, హెచ్ఎం శ్రీవాణి ,ఉపాధ్యాయులు వేణుగోపాల్ ,వెంకట సిద్ధులు, రాజేంద్ర, పద్మవేణి, సుభాషిణి, కన్నగి, తదితరులు అభినందించారు.

ఘనంగా 1990-91 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మెళనం

విశాలాంధ్ర -వరదయ్యపాలెం :వరదయ్యపాలెం జడ్పీ హైస్కూల్ 1990-91 సంవత్సరానికి చెందిన 10 వ తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. గోవర్ధన పురం పాఠశాల ఆవరణలో సరస్వతి పూజను నిర్వహించారు. తమకు విద్యాబుద్దులు నేర్పిన ఉపాధ్యాయులు,హిందీ పండితులు పి మునస్వామి,ఆంగ్ల ఉపాధ్యాయులు రసూల్ సాహెబ్,డ్రాయింగ్ మాస్టర్ ఏవివి సత్యనారాయణ,డ్రిల్ మాస్టర్ మునీంద్రయ్య,గణిత ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం,సామాన్య శాస్త్రం ఉపాధ్యాయులు రమణారెడ్డి,లకు వేద మంత్రాలతో,పూర్ణ కుంభ స్వాగతం పలికి,తమ గురుభక్తిని చాటుకున్నారు.ఈ సందర్భంగా గురువులను ఘనంగా సత్కరించారు.గురువులు తమ విలువైన సందేశాలను, ఆశీస్సులను అందించారు.పర్యావరణం కాపాడుకోవాల్సిన ప్రతి ఒక్కరిపై ఉందని,ఆర్థికాభివృద్ధికి ఒకరికి ఒకరు తొడ్పాటు అందించుకుంటూ ఐక్యత తో ఉండాలి అని సూచించారు. తల్లిదండ్రులు,అత్త మామలు, కుటుంబ బంధాలు పట్ల ప్రేమానురాగాలు బలపడేవిధంగా నడచుకుని సమాజానికి మార్గదర్శకులు కావాలని హితవుపలికారు.ఈ సందర్భంలో పూర్వ విద్యార్థులు తమ చిన్న నాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు.నాగప్రసాద్,సల్లా వీరభద్రయ్య, మురుగయ్య,రాకేష్,గణేష్,శారద, జయసుధ,అరుణ,70 మందికి పైగా పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

NAME CHANGE

I **THURPU SAINATHA** S/o T. Muni Reddy, R/o Door No. 34-164/6, Neelakunta Village, Palamaneru Post, Chittoor Dist.Andhra Pradesh, Pin No. 517408. I have changed my wife name from **T. SUJATHA to THURPU SUJATHA.**

చంద్రగిరిలో టీడీపీకి బిగ్ షాక్...!

ఆర్ ఎస్ మస్తాన్ వైసీపీలో చేరిక

- వైసీపీ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే చెవిరెడ్డి

విశాలాంధ్ర -తిరుపతి రూరల్ : తెలుగు దేశం పార్టీ ఆవిర్భావం (1983) నుంచి పార్టీ కార్యకర్తగా పని చేస్తూ ప్రస్తుతం చంద్రగిరి నియోజక వర్గ టీడీపీ మైనారిటీ విభాగం అధ్యక్షుడుగా వున్న ఆర్ ఎస్ మస్తాన్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఆది నుంచి తెలుగు దేశం పార్టీకి వీరాభిమానిగా ఉంటూ ఆ పార్టీకి సేవలు అందించిన ఆర్ ఎస్ మస్తాన్ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి అందించే సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే చెవిరెడ్డి కులం, మతం, పార్టీ, ప్రాంతం అన్న తేడాలేకుండా అభివృద్ధి పనులు చేయడం పట్ల ఆకర్షితులై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు వివరించిన మస్తాన్ వచ్చే ఎన్నికల్లో చెవిరెడ్డి మోహిత్ రెడ్డి విజయానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. కరుడు కట్టిన టీడీపీ అభిమాని ఆర్ ఎస్ మస్తాన్ వైసీపీలోకి రావడం పట్ల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తిరుపతి జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు చేగు ప్రశాంత్ గుప్తా, చంద్రగిరి మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ చేగు గోవర్ధన్ గుప్తా, సర్పంచ్ భర్త రామ్మూర్తి, చంద్రగిరి మండలం వైసీపీ నేతలు మస్తాన్, బుల్లెట్ చంద్రమౌళి రెడ్డి కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, ప్రవీణ్ లు అభినందించారు.

ప్రచారం నిర్వహిస్తే తప్పతాగి అడ్డుకుంటారా..

ఎమ్మెల్యేని ప్రశ్నించిన రిషితారెడ్డి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: తమ భర్త బొజ్జల సుధీర్‌రెడ్డి గెలుపు కోసం తాము ప్రచారం చేసుకుంటుంటే దాన్ని వైకాపా నాయకులు, కార్యకర్తలు తప్పతాగి అడ్డుకోవడం, తమ వాహనానికి అడ్డుపడి వీరంగం సృష్టించడం ఎంత వరకు సబబు అని బొజ్జల రిషితారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఈ మేరకు ఆమె ఒక వీడియో విడుదల చేశారు. శ్రీకాళహస్తిలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందనేందుకు శనివారం సాయంత్రం జరిగిన ఘటనే నిదర్శనమన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రచారం చేసుకోవడం ఓటు అభ్యర్థించే హక్కు ఎవరికైనా ఉందని ఇందులో భాగంగానే తన భర్త గెలుపు కోసం తాను శ్రీరామ్‌నగర్ కాలనీలో ప్రచారం ప్రారంభించినట్లు చెప్పారు. తమ పార్టీ తరఫున ప్రచారంకు వచ్చిన విషయం ప్రజలకు తెలియజేసేందుకు ప్రతి వార్డులో లాగే ఈ వార్డులో కూడా ప్రచారం రథం వచ్చిందన్నారు. తాము ప్రచారం చేసుకుంటేంటే వైకాపాకు చెందిన ఏర్పేడు ఇన్‌ఛార్జి కిషోర్‌రెడ్డి, అమ్మపాళెంకు చెందిన మురళి, బోర్డు మెంబరు మోహన్ మరికొంతమంది పార్టీ కార్యాలయం వద్ద తప్పతాగి అక్కడ ఉన్న తమ వాహనాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించారని ఆవేదన వ్యక్తం చేశారు. బొజ్జల గోపాలకృష్ణారెడ్డి చిత్రపటాన్ని తొలగించి వాహనానికి అడ్డు నిలబడి తమ కార్యకర్తలను రెచ్చగొట్టడం ఏం సంప్రదాయమన్నారు. స్వచ్ఛమైన రాజకీయాలకు తమ కుటుంబం నిదర్శమని ఇలాంటి రౌడీయిజం తాము ఎప్పుడూ చూడలేదన్నారు. ఈ ఘటన చూస్తుంటే పట్టణంలో పరిస్థితి ఏ విధంగా తయారైందో అర్థం చేసుకోవచ్చునని చెప్పారు. ఎమ్మెల్యే కూతురు తమ ఊరికి ప్రచారం కోసం వచ్చి తమ ఇంటికి వస్తే తాము ఎంతో గౌరవంగా మాట్లాడి పంపించామని ఎక్కడా ఎలాంటి సమస్య సృష్టించలేదన్నారు తాము మహిళలకు ఇచ్చేగౌరవం ఇలాంటిదన్నారు. ఇలాంటి రౌడీ రాజకీయాలకు స్వస్తి పలకాల్సిందిగా ఆమె పిలుపునిచ్చారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

విశాలాంధ్ర-చౌడేపల్లి : చౌడేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1987 88 విద్యా సంవత్సరం పూర్వ విద్యార్థులు పాఠశాల ఆవరణలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. కుప్పం పిసిఎస్ ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో రోగుల వివిధ రకాల వ్యాధులకు పరీక్షలు జరిపి ఉచితంగా మందులను అందజేశారు. అవసరమైన వారికి ఉచిత శస్త్ర చికిత్సలకు సిఫారసు చేశారు. శిబిరానికి వచ్చిన వారికి అన్నదాన సేవను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రాజేష్, అశోక్, రాజేంద్ర, గంగాధర, అరుణ, శారద భాయ్, మధుమతి లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరులో ప్రజాస్వామ్యం ఖూనీ

పెద్దిరెడ్డికి వత్తాసు పలుకుతున్న అధికారులు

ప్రతిపక్షాల గొంతు నొక్కాలని చూస్తున్నారు -మా పార్టీ నాయకులు, కార్యకర్తలను చెప్పులతో కొట్టారు

విశాలాంధ్ర - పుంగనూరు : మంత్రి పెద్దిరెడ్డి చిత్తూరు ఎస్పీ రిషాంత్ రెడ్డి, పలమనేరు డిఎస్పీ, పుంగనూరు పోలీసులపై గవర్నర్ కు ఫిర్యాదు చేసిన బిసివై పార్టీ అధినేత బోడె రామచంద్రయాదవ్.పుంగనూరులో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని, అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని కాపాడాలని ఎపి గవర్నర్ కు భారత చైతన్య యువజన పార్టీ అధినేత బోడె రామచంద్రయాదవ్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన ఎపి రాజ్ భవన్ లో గవర్నర్ ను కలిసి పుంగనూరులో జరుగుతున్న అరాచకాలపై ఫిర్యాదు చేశారు. పుంగనూరు నియోజకవర్గంలో పోలీసులు... పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సొంత మనుషుల్లా వ్యవహరిస్తున్నారని, ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. భాతర చైతన్య యువజన పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన అన్ని కార్యక్రమాలను పోలీసులు బలవంతంగా అడ్డుకున్న విషయాన్ని ఆయన గవర్నర్ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే పోలీసులు బిసివై పార్టీ కార్యకర్తలపై చేసిన దాడికి సంబంధించిన పోటోలు, సిఐ చెప్పుతో కొట్టిన పోటోలను ఫిర్యాదుతో పాటు గవర్నర్ కు అందజేశారు. సాంప్రదాయంగా జరుపుకునే పండుగలకు కూడా అనుమతుల పేరుతో పోలీసులు వేధిస్తున్న విషయాన్ని ఆయన గవర్నర్ దృష్టికి తీసుకువచ్చారు. బోడె రామచంద్రయాదవ్ ఫిర్యాదును స్వీకరించిన గవర్నర్ సానుకూలంగా స్పందించారు. సాక్ష్యాధారాలను పరిశీలించి విచారణ జరిపిస్తామని తెలిపారు. అనంతరం బోడె రామచంద్రయాదవ్... రాజ్ భవన్ బయట మీడియాతో మాట్లాడారు. "గత వారం రోజుల క్రితం పుంగనూరు నియోజకవర్గంలో నియోజకవర్గస్థాయిలో రైతుల సమస్యల పైన అలాగే నియోజకవర్గంలో ఉన్న సమస్యల పైన బహిరంగ సభ నిర్వహించాలని తలపెట్టాం. ఒక ప్రైవేట్ స్థలంలో స్థల యజమాని అనుమతి తీసుకొని, అన్ని సౌకర్యాలతో ఎవరికీ ఇబ్బందులు లేకుండా సభ నిర్వహించడానికి ఏర్పాట్లు చేసుకున్నాం. కానీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మెప్పు కోసం పోలీస్ శాఖలో ఉన్న కొంతమంది అధికారులు అక్రమంగా ఆ కార్యక్రమాన్ని అడ్డుకోవడంతోపాటు పూర్తిగా అక్కడ భయానక వాతావరణాన్ని సృష్టించారు. అక్కడున్న మా కార్యకర్తలను, నాయకులను అరెస్టు చేయడంతో పాటు కార్యకర్తల పైన లాఠీచార్జి చేసి లాఠీలతో బెదిరించారు. చెప్పులతో దాడి చేశారు. పుంగనూరు నియోజకవర్గంలోనే కొంతమంది పోలీస్ అధికారులు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మెప్పు కోసం ఇలా చేయడం చూస్తుంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం నడుస్తుందా, అంబేద్కర్ గారి రాజ్యాంగం ఉందా అనే విషయాన్ని ఈరోజు ప్రజలందరూ కూడా చర్చించుకుంటున్నారు. ముఖ్యంగా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొంతమంది పోలీసు అధికారులు ప్రతిపక్షాలను వేధించడమే విధిగా పెట్టుకున్నారు. జగన్మోహన్ రెడ్డి ఈ రాష్ట్రానికి చక్రవర్తి అన్నట్టు పెద్దిరెడ్డి సామంత రాజయినట్టు భావించి ఒక రకమైన మైకంతో వ్యవహరిస్తున్నారు. రాజకీయ నాయకుల్లాగా, వైఎస్ఆర్సిపి కార్యకర్తల్లా కొందరు పోలీసులు ప్రవర్తిస్తున్నారు. మరీ ముఖ్యంగా చిత్తూరు జిల్లా ఎస్పి రిషాంత్ రెడ్డి ... ఐఐటి ముంబైలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి యువ ఐపిఎస్ అధికారిగా జిల్లాకు వచ్చారని తెలియగానే జిల్లా వాసులందరూ తమకు మంచి జరుగుతుందని భావించారు. శాంతి భద్రతలు కాపాడుతారుకున్నారు. కానీ ఆయన ఒక వైసీపీ కార్యకర్తలాగ, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి భంట్రోతులాగ వ్యవహరిస్తూ ప్రతిపక్షాలను వేధించడమే పనిగా పెట్టుకున్నారు. ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేసి ప్రతి ఒక్కరి మీద తప్పుడు కేసులు పెడుతూ ఒక భయానక వాతావరణాన్ని స్రుష్టిస్తున్నారు. ఎస్పీ రిషాంత్ రెడ్డి... మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మెప్పు కోసం ఇలాంటి నీచమైన కార్యకర్తలు చేస్తున్నారు. గత నాలుగున్నరేళ్లుగా ఇలాగే తప్పుడు కేసులు పెట్టి అన్ని రకాలుగా భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. పుంగనూరు నియోజకవర్గంలో వ్యక్తుల మీదే కాకుండా ఆస్తులపై కూడా దాడులు చేస్తున్నారు. ఇవన్నీ గమనిస్తున్న రాష్ట్ర ప్రజలు ఎప్పుడు ఎన్నికలు వస్తాయా? ఎప్పుడు జగన్ మోహన్ రెడ్డిని ఇంటికి సాగనంపుదామా? అని ఎదురుచూస్తున్నారు. అలాగే వైసీపీ నాయకులకు తొత్తులుగా వ్యవహరిస్తున్న అధికారులు కూడా రాబోయే రోజుల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు. చివరకు పల్లెల్లో సాంప్రదాయ బద్ధంగా జరిగే పండుగలకు కూడా ఆంక్షలు విధిస్తూ ఎంతో ప్రశాంత వాతావరణం జరిగే పండుగలను కూడా పోలీసులు పెద్దిరెడ్డి మెప్పు కోసం వాడుకుంటున్నారు. అనుమతులు కావాలి, చలాన్లు కట్టాలి, డిఎస్పీ దగ్గర అనుమతి తీసుకోవాలని వేధిస్తున్నారు. పుంగనూరులో జరుగుతున్న పెద్దిరెడ్డి అరాచకాలతో పాటు పోలీసుల తీరుపై సాక్ష్యాధారాలతో సహా గవర్నర్ గారికి ఫిర్యాదు చేశాను. విచారించి చర్యలు తీసుకుంటామని వారు కూడా సానుకూలంగా స్పందించారు " అని బోడె రామచంద్రయాదవ్ మీడియాకు తెలిపారు.

వన్నె రెడ్డి సంఘం నూతన భవనం నిర్మాణానికి

భూమి పూజ చేసిన మంత్రి రోజా

విశాలాంధ్ర - పుత్తూరు టౌన్ : రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక వ్యవహారాల,యువజన సర్వీసుల మరియు క్రీడా శాఖ మంత్రి ఆర్.కె.రోజా పుత్తూరు వన్నె రెడ్డి సంఘం నూతన భవనం నిర్మాణానికి ఆదివారం భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు.రాష్ట్రముఖ్యమంత్రివై.ఎస్.జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర మంత్రి ఆర్.కె.రోజా సిఫార్సు మేరకు రాష్ట్రంలో మరెక్కడా లేనివిధంగా వన్నెరెడ్డి సంఘానికి 1 - 04 సెంట్ల విస్తీర్ణంలో ప్రభుత్వ భూమిని మంజూరు చేశారు వన్నె రెడ్డి ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న వన్నెరెడ్డి సంఘం కమ్యూనిటీ హాల్ భవనము మరియు కల్యాణ మండపం నిర్మాణ కలను నెరవేర్చారుపుత్తూరు రూరల్ నేసనూరు లెక్క దాఖలా కొండల చెరువు గ్రామ పరిధిలో వన్నెరెడ్డి సంఘం కమ్యూనిటీ హాల్ భవనము మరియు కల్యాణమండపం శంకుస్థాపనకు హాజరైన మంత్రి గారికి వన్నెరెడ్డి కుల సంఘాల నాయకులు ప్రజలు వైస్సార్సీపీ నాయకులు కార్యకర్తలు, మహిళలు మంగళవాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని వన్నె రెడ్డి కుల సంఘాల నాయకులు, సభ్యులు మరియు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చౌడేపల్లిలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ

విశాలాంధ్ర- చౌడేపల్లి : పట్టణం లో అన్ని వీధుల్లోల్లోనూ శనివారం " బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ " కార్యక్రమాన్ని చేపట్టారు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గువ్వల రమేష్ రెడ్డి (చిట్టి) ఆధ్వర్యంలో పుంగనూరు నియోజకవర్గ తెదేపా ఇంచార్జ్ చల్లా రామచంద్రారెడ్డి (బాబు) చౌడేపల్లి పట్టణం లోని అన్ని వీధులలోనూ ఇంటింటికీ తిరిగి తెలుగుదేశం పార్టీ అధినేత రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాలు ప్రజా సంక్షేమ పథకాలు అభివృద్ధిని గురించి కరపత్రాలు అందిస్తూ ప్రతి ఇంటికి వెళ్లారు భావితరాలు భవిష్యత్తు బాగుండాలంటే రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు పట్టణం లో చల్లా బాబు పర్యటించారు ప్రతి వీధిలోనూ ఆయనకు మహిళలు ఎదురెళ్లి హారతి పల్లాలతో స్వాగతం పలికారు యువకులు బాణాసంచా పేల్చి తమ అభిమానాన్ని చాటుకున్నారు ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్చార్జి చిన్నా రాయల్ మండల అధ్యక్షుడు పురుషోత్తం తెలుగుదేశం పార్టీ నాయకులు లక్ష్మీపతి రాజు ఆవుల రామచంద్రయ్య పార్లమెంట్ నియోజకవర్గాల అధికార ప్రతినిధి వెంకటరమణ ప్రచార కార్యదర్శి ముని వెంకటప్ప మైనార్టీ అధ్యక్షుడు గని ,తెలుగు యువత పవన్,కొలింపల్లి గణేష్ బోయకొండ సుబ్బు, పర్యటన సుబ్రహ్మణ్యం, హరి, ప్రభాకర్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

తండ్లం మునికృష్ణయ్యకు అభ్యర్థిగా అవకాశం ఇవ్వండి



విశాలాంధ్ర - చంద్రగిరి: చంద్రగిరి మండలం తొండవాడ హరిజనవాడకు చెందిన తండ్లం ముని కృష్ణయ్య తాను ఆది నుంచి కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నానని రానున్న సాధారణ ఎన్నికల్లో చంద్రగిరి ఎస్సీ కోటాలో కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించాలని కోరారు. విద్యార్థి దశ నుంచే కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ ఇప్పటివరకు పార్టీ అనేక కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొని కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుగా పదవి బాధ్యతలు స్వీకరించిన షర్మిలకు ఆయన అభినందనలు తెలిపారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులైన స్వర్గీయ రెడ్డి వారి నాదముని రెడ్డి, రాజగోపాల్ నాయుడు, అగరాల ఈశ్వర్ రెడ్డితో సహచర్యం చేశానని కాంగ్రెస్ పార్టీలో కొనసాగిన గల్లా అరుణకుమారి అభివృద్ధికి ఎంతగానో తోడ్పడినట్లు ఆయన లేఖలో పేర్కొన్నారు. తనకు తన గ్రామం, మండలం, నియోజకవర్గంలో తమ ఎస్సీ సామాజిక వర్గ ఓటర్లే కాకుండా అన్ని సామాజిక వర్గాల ప్రజల అండదండలు పుష్కలంగా ఉన్నాయన్నారు. రాజకీయాలలో కొత్త వారికి అవకాశం కల్పించే దిశగా తన అభ్యర్థిత్వాన్ని ప్రకటించాలన్నారు. నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో తాను బరిలోకి దిగుతున్నట్లు పేర్కొన్నారు. తాను చంద్రగిరి నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయడానికి అన్ని విధాల అర్హతలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల అలాగే జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్ రెడ్డికి తనను అభ్యర్థిగా ప్రకటించాలని కోరనున్నట్లు సమాచారం.

సుబ్రమణ్య స్వామి దేవస్థానం మాజీ చైర్మన్
టిడిపిలో చేరిక

విశాలాంధ్ర - పాకాల : పాకాల మండలం మొగరాల గ్రామపంచాయతీ కృష్ణాపురం కు చెందిన మాజీ సుబ్రమణ్య స్వామి దేవస్థానం చైర్మన్ రేజర్ల ఆనంద చౌదరి ఆదివారం చంద్రగిరి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ పులివర్తి నాని సమక్షంలో వైకాపా నుండి టిడిపిలో చేరారు. 2019 నుండి రెండు పర్యాయాలు ఊట్ల వారి పల్లె సమీపంలోని ఆనందగిరి వల్లి సమేత సుబ్రమణ్య స్వామి దేవస్థానం చైర్మన్ గా పని చేసిన ఆయన ఎన్నికల అనంతరం వైకాపాలో చేరారు. ఆదివారం కృష్ణాపురంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆనంద చౌదరికి పులివర్తి నాని టిడిపి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఆనంద చౌదరి తో పాటు పెద్ద హరిజనవాడకు చెందిన చిట్టిబాబు అతని అనుచరులు సైతం టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా ఆనంద చౌదరి మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తుందని నమ్మి ఆ పార్టీలో చేరానని అయితే వైకాపా పాలనలో అరాచకమే తప్ప అభివృద్ధి శూన్యమన్నారు. రాష్ట్ర అభివృద్ధి ఒక టిడిపి తోనే సాధ్యమని తెలుసుకొని సొంత గూటికి చేరానని ఇకపై తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పని చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన బోయకొండ

విశాలాంధ్ర-చౌడేపల్లి : ప్రముఖ పుణ్యక్షేత్రం బోయకొండ పై ఆదివారం భక్తుల రద్దీ అధికమైనది.నేటి ఉదయాన్నే ఆలయ అర్చకులు వేదపండితుల ఆధ్వర్యం లో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు.మన రాష్ట్రం తో పాటు తమిళనాడు,కర్ణాటక నుంచి విశేష సంఖ్యలో భకులు తరలిరావడం తో ఆలయం భక్తసంద్ర ౦మైనది. ఉదయం నుండి సాయంత్రం వరకు అమ్మవారి క్యూలైన్ లు అన్నీ యాత్రికులతో నిండిపోయాయి. వచ్చిన భక్తులకు ఆలయ చైర్మన్ నాగరాజ రెడ్డి, ఈ.ఓ చంద్రమౌళి పర్యవేక్షణ లో సేవలందించారు.

జగన్ అధికారంకోసం నిరుపేద దళితుని బతుకు చీకటి మయం

కన్న తల్లి ఉసురు తప్పక జగన్ రెడ్డికి తగులుతుంది - తెలుగు మహిళలు

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : జగన్ రెడ్డి అధికారంకోసం నిరుపేద దళితున్ని పాత్రధారిచేసి (కోడి కత్తి డ్రామా) తో శీను బతుకు ని చీకటి మయం చేసిందని, కన్న తల్లి ఉసురు జగన్ రెడ్డికి తప్పక తగులుతుంది అంటూ తెలుగు మహిళలు దుయ్యబట్టారు. ఆదివారం తిరుపతి పార్లమెంట్ తెలుగు మహిళా అధ్యక్షురాలు చక్రాల ఉష ఆధ్వర్యంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంకు ముఖ్యఅతిధిగా శ్రీకాళహస్తి ఇన్ఛార్జి బొజ్జల సుధీర్ రెడ్డి సతీమణి హాజరయ్యారు. ఈ సందర్భంగా బొజ్జల రిషితరెడ్డి, చక్రాల ఉష మాట్లాడుతూ దళితుల మీద కపట ప్రేమ నటిస్తూ అంబేడ్కర్ విగ్రహాన్ని నెలకొల్పి మహనుభావుడు అనిపించుకుందామని ప్రయత్నం చేసినప్పటికీ దళిత సమాజం మిమ్మల్ని నమ్మే పరిస్థితి లేదని, అంబేడ్కర్ మీద అభిమానం ఉంటే అతని ఆశయాలు నెరవేర్చాలి గాని విగ్రహాలు పెట్టినంత మాత్రాన నీకు దళితుల మీద ప్రేమ ఉన్నట్లు కాదన్నారు. నిజమైన ప్రేమ ఉంటే నీ గుమ్మం ముందు కూడా రానీకుండా దళితులని అవమానపరచడం, నీ పక్కన కనీసం నడిచే అవకాశం కూడా వాళ్ళకి ఇవ్వకపోవడం, మాస్క్ అడిగిన పాపానికి ఒక డాక్టర్ని గుండు కొట్టి పిచ్చోన్ని చేసి మరీ చంపడం, నాగమ్మ లాంటి మహిళలను అత్యంత క్రూరంగా అత్యాచారం చేసి హత్య చేస్తే వేడుక చూస్తూ ఇంతకాలం కాలం గడిపే నువ్వు, దళితుల్ని చంపి తలలు డోర్ డెలివరీ చేసిన వ్యక్తులకే పదవులు కట్టబెట్టడం, దళితులు యొక్క కార్పోరేట్ నిధులను కూడా ఈ పథకాలకు దారి మళ్లించడం, ముసలి తల్లి ఆవేదన కూడా తెలియని నీ అవసరం కోసం వాడుకొని శ్రీను బతుకు చీకటి మయం చేసిన నువ్వు దళిత ద్రోహివికావా అంటూ విరుచక పడ్డారు. అధికార దాహం కోసం దళితుడి జీవితాన్ని పణంగా పెట్టి జగన్ రెడ్డి తన రాజకీయ ప్రయోజనం నెరవేర్చుకున్నాడన్నారు. అధికారం కోసం కోడి కత్తి దాడిని వాడుకున్న జగన్ రెడ్డి, తాను జగన్ రెడ్డి అభిమానినని, జగన్ రెడ్డి మైలేజ్ కోసమే దాడి చేసానని అప్పట్లో శ్రీనివాస్ చెప్పాడు. అతన్ని వాడుకోనీ వదిలేయటంలో సిద్ధహస్తుడైన జగన్ రెడ్డి కోడి కత్తి కేసులో కూడా వాడుకొని వదిలేసాడని చెప్పారు. పేదరికం, కుటుంబానికి చెందిన శ్రీనుని కూడా వాడుకొని వదిలేసాడని చెప్పారు. పేదరికం, వృద్దాప్యంలో ఉన్న తల్లితండ్రులకు కన్నీటి ఘోష మిగిల్చారన్నారు. జగన్ రెడ్డి తన స్వార్థ ప్రయోజనాల కోసం దళితుడిని వాడుకున్న తీరు అత్యంత దారుణం. బాధితుడైన జగన్ రెడ్డి కోర్టుకు వచ్చి సాక్ష్యం చెప్పాలని కోర్ట్ చెబుతున్న,కోర్టుకు హాజరు కాకుండా మినహాయింపు ఇవ్వాలని కోర్టును కోరటం కేసును నీరుకార్చటానికి ప్రయత్నంచేయటమేనని చెప్పారు. తన అవినీతి కేసులో కోర్టుకు వెళ్లారు, బాబాయ్ హత్యకేసులో సిబిఐ డిమాండ్ చేసి, తర్వాత వద్దన్నారు, ఇప్పుడు ఆ కేసులో నిందితుల్ని కాపాడుతూ... చెల్లెలి పైకి నెట్టే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. కోడి కత్తి కేసులో శ్రీను బెయిల్ పై భయటకు రాకుండ చేస్తూ, తల్లితండ్రులకు కుమారుడిని దూరంచేసి వారి కుటుంబానికి క్షోభ పెడుతున్నాడన్నారు. నాలుగేళ్ల పాటు కనీసం కేసును పట్టించుకోలేదని, నాలుగేళ్ల తరువాత కేసు విచారణ సరిగా జరగలేదంటు కోర్టులో పిటీషన్ వేశాని అన్నారు. ఇకనైనా కోడి కత్తి కేసులో జన్మనిమభ్యపెట్టే ప్రయత్నాలు మానుకోవాలని హితవుపలికారు. కనీసం మానవత్వమున్నా ప్రదర్శించి ఆ ముసలి తల్లికి అండగా నిలిచి కోర్టుకి నిజా నిజాలు సాక్షిగా చెప్పి ఆ అమాయకుడిని విడిపించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెలుగు మహిళలు, పట్టణ అధ్యక్షురాలు సుమతి, మండల అధ్యక్షురాలు సుభాషిని, మాజీ కౌన్సిలర్ అనిత, చంద్రకళ, సుజాత, అమ్ములు, ఊహ, జైశ్రీ, అమరావతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పులివర్తి నాని ఆధ్వర్యంలో టీడీపీ భారీ ర్యాలీ

విశాలాంధ్ర - పాకాల : చంద్రగిరి నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ పులివర్తి నాని ఆధ్వర్యంలో ఆదివారం టిడిపి, జనసేన నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. 13 రోజుల క్రితం ఓటర్ల జాబితాలో అవకతవకలపై న్యాయం చేయాలని కోరుతూ నిరసన దీక్ష చేపట్టి ఒంటిపై పెట్రోల్ పోసుకొని గాయపడి చికిత్స పొంది కోలుకొని ఆదివారం సుబ్రమణ్య స్వామి దేవస్థానం కమిటీ మాజీ చైర్మన్ ఆనంద్ చౌదరి పార్టీలో చేరుతున్న సందర్భంగా మండలానికి విచ్చేసిన పులివర్తినానికి దామలచెరువు హై స్కూల్ గేటు వద్ద టిడిపి జనసేన నాయకులు ఘన స్వాగతం పలికారు. మహిళలు మంగళహారతులు పట్టారు. అనంతరం దామల చెరువు నుండి మ్యాంగోనగర్ మీదుగా కృష్ణాపురం వరకు సుమారు 7 కిలోమీటర్లు టిడిపి జనసేన జెండాలు చేతబట్టి భారీ స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాని దారి పొడుగునా ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

శెట్టిపేటలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

విశాలాంధ్ర-చౌడేపల్లి : మండలంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం లో భాగంగా శెట్టిపేట గ్రామపంచాయతీ భవనం ప్రాంగణం లో నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమం లో సర్పంచ్ ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ ఫథకాల గురించి వివరించడం జరిగింది.అదే విధముగా ఉజ్వల్ యోజనా గ్యాస్,లబ్దిదారులకు గ్యాస్ కిట్లు,ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులు అందించడం జరిగిందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో అధికారులతో పాటు సిబ్బంది,గ్రామస్తులు పాల్గొన్నారు. వికసిత్ భారత్ సంకల్పయాత్ర పేరుతో యాత్ర చేపట్టి ప్రజాక్షేత్రంలోకి వెళ్తోంది. కేంద్ర ప్రభుత్వం అధికారికంగా చేపడుతున్న కార్యక్రమాలను,పథకాలను వివరించారు.

మోనాశ్రీ ట్యుటోరియల్స్ విద్యార్థినికి బంగారు పతకం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: జాతీయ స్థాయిలో ఇటీవల నిర్వహించిన సైన్సు ఒలంపియాడ్ పరీక్షల్లో శ్రీకాళహస్తి పట్టణం బీవీ అగ్రహారం త్యాగరాజవీధిలో గల మోనాశ్రీ ట్యుటోరియల్స్ విద్యార్థిని ధనుష్కకు బంగారు పతకం లభించింది. జాతీయ స్థాయిలో నిర్వహించిన ఈ పరీక్షల్లో ధనుష్క తొమ్మిదవ తరగతి విభాగంలో మొదటి ర్యాంకు సాధించింది. బంగారు పతకం సాధించిన ధనుష్కను పలువురు అభినందించారు. మోనాశ్రీ ట్యుటోరియల్స్ నిర్వాహకురాలు వినుకొండ మాధురి కృషి ఫలితంగానే తనకు మొదటి ర్యాంకు వచ్చిందని ధనుష్క ఈ సందర్భంగా తెలిపింది. మోనాశ్రీ ట్యుటోరియల్స్ ట్యుటోరియల్స్ లో క్రమశిక్షణతో కూడిన ఉత్తమ విద్య బోధించడం వలనే ఇక్కడ చదివే విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తున్నారని తల్లిదండ్రులు చెబుతున్నారు. మోనాశ్రీ ట్యుటోరియల్స్ నిర్వాహకురాలు వినుకొండ మాధురి అంకితభావాన్ని తల్లిదండ్రులు, విద్యార్థులు కొనియాడుతున్నారు. ఈ సందర్భంగా వినుకొండ మాధురి మాట్లాడుతూ... తమ టూటోరియల్ నందు అర్హత కలిగిన అధ్యాపక బృందం విద్యార్థులకు న్యాయమైన విద్యను అందించడమే తమ లక్ష్యమని భవిష్యత్తులో మరిన్ని ఉత్తమ ర్యాంకులు సాధించడానికి కృషి చేస్తామన్నారు. ఇందుకు విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సహకారం కావాలని మాధురి కోరారు.

కార్యకర్త కుటుంబానికి టీడీపీ చేయూత

విశాలాంధ్ర - గుడిపాల : గుడిపాల మండలం గుడిపాల పంచాయతీ, బట్టువాల్లూరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కరుడు గట్టిన కార్యకర్త శ్రీ. చలిచీమల సుబ్రహ్మణ్యం నాయుడు ఆకస్మిక మరణం తో కుంగిపోయిన వారి కుటుంబానికి కి టీడీపీ తోడుగా ఉంటుందని. అందులో భాగంగా ఇవాళ టీడీపీ గుడిపాల మండలం ప్రెసిడెంట్ శ్రీ. సి . సుబ్రహ్మణ్యం నాయుడు వారి కుటుంబాన్ని కలిసి కార్యకర్త కుమార్తె అయిన యస్ జ్యోష్న చదువుకు కావలిసిన ఆర్థిక సహాయం చెక్ రూపములో అందించారు ఆమె చదువు పూర్తి అయ్యే వరకు ఆర్ధిక సహాయం చేసి తోడుగా ఉంటాను అని తెలియచేసారు, అదేవిదంగా తెదేపా కార్యకర్త కుమారుడు అయిన యస్ గిరీష్ కి చదువుకు అయ్యే ఖర్చు మొత్తం బరిస్తాం అని శ్రీ. గురజాల చెన్నకేశవులు నాయుడు మరియు జి. జె. యం ట్రస్ట్ చైర్మన్ గురజాల జగన్మోహన్ గారు తెలియచేసారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చి ఆదుకోవాలి: మల్లేశ్వరరావు

విశాలాంధ్ర - తిరుపతి రూరల్ : అనాదిగా కులవృత్తి జీవనంగా బతుకులు వెల్లదీస్తూ అనగారిన పోతున్న రజక జాతిని ఎస్సీ జాబితాలో చేర్చి ఆదుకోవాలని, ఆ దిశగా రాజకీయ పార్టీలు నిర్ణయం ప్రకటించాలని నేషనల్ ధోబి మహాసంఘ్ జాతీయ అధ్యక్షులు అన్నవరపు నాగమల్లేశ్వరరావు డిమాండ్ చేశారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేస్తూ తిరుపతి నుంచి విజయవాడకు ఆయన తలపెట్టిన పాదయాత్ర ఆదివారం శ్రీవారి పాదాల వద్దనుండి ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా అలిపిరి పాదాల మండపం వద్ద పూజాది కార్యక్రమాలు చేసి కొబ్బరికాయలు కొట్టి గోవిందా మా మొర ఆలకించి సఫలీకృతం చేయాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 18 రాష్ట్రాలలో రజకులు ఎస్సీ జాబితాలో ఉన్నారని, 11 రాష్ట్రాల్లో ఓబీసీలుగా కొనసాగుతున్నారని తెలిపారు. దేశ వ్యాప్తంగా రజకులందరిని ఎస్సీ జాబితాలో చేర్చి వారి అభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఏళ్ల తరబడి రజకులను ఎస్సీలుగా గుర్తించాలని అనేక పోరాటాలు చేస్తున్నా పాలకులు పట్టించుకోలేదన్నారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో రజకుల స్థితిగతులను గుర్తించి ఎస్సీ జాబితాలో చేర్చడానికి పాదయాత్రను చేపట్టామన్నారు. ముఖ్య అతిథులుగా హాజరైన రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, కేశన శంకర రావు, కర్నాటక చిత్ర దుర్గ పీఠాధిపతి బసవమాసుదేవ స్వామి పాదయాత్రను ప్రారంభించారు. మీసాల రంగన్న మాట్లాడుతూ అన్ని రంగాలలో వెనుకబడుతూ అసమానతలకు గురవుతున్న రజకులకు సముచిత స్థానంతో పాటు అన్ని రకాల రిజర్వేషన్లు, లబ్ధి పొందాలంటే ఎస్సీ జాబితాలో చేర్చాల్సిన అవసరం ఉందన్నారు. నాగమల్లేశ్వరరావు ఇందుకోసం తలపెట్టిన పాదయాత్రను తాను అభినందిస్తున్నానన్నారు. తనవంతుగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి రజకుల జాబితాలో చేర్చేందుకు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం శంకర్రావు మాట్లాడుతూ రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలన్న డిమాండు సముచితమైనదన్నారు. రజక నేతల పాదయాత్రకు తమ సంపూర్ణ మద్దతు పలుకుతున్నానన్నారు. ఈ కార్యమంలో బీసీ సంక్షేమ సంఘం నేతలు కుమ్మర క్రాంతి కుమార్, నాగరాజు గౌడ్, రజక సంఘ నేతలు మల్లెమొగ్గల ఉమాపతి, సుధాకర్, దేవానంద్, దాము, యశోద, బాలయ్యతో పాటు పెద్ద సంఖ్యలో రజకులు పాల్గొన్నారు.

అయోధ్య విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని

తిలకించే అవకాశం కల్పించండి

బిజెపి నియోజకవర్గ కన్వీనర్ కోలా ఆనంద్

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : అయోధ్యలో ఈ నెల 22న జరిగే బాలరాముని విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని తిలకించే అవకాశం కల్పించాలని, అందుకు ఈ నెల 22న సెలవు ప్రకటించాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యదర్శి, నియోజకవర్గ కన్వీనర్ కోలా ఆనంద్ కోరారు. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన అయోధ్య శ్రీరామచంద్రుని విగ్రహ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థ్ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో 22వ తేదీన ఉదయం నుంచి నరేంద్రమోదీ చేతులు మీదుగా జరుగుతున్న బాల రాముని ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాన్ని ప్రజలందరూ ప్రచార సాధనల్లో తిలకించేందుకు ఆ రోజున రాష్ట్ర ప్రభుత్వం అన్ని కార్యాలయాలకు, విద్యాసంస్థలుకు సెలవులు ప్రకటించాలని, విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోలా ఆనంద్ కోరారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజలందరు సోమవారం ఉదయం నుంచి తమ ఇల్లాలను శుభ్రంచేసుకోని, పూజ గదులను శుద్ధిచేసిన అనంతరం సాయంత్రం తమ తమ ఇంటి ముంగిట్లో ఐదు ప్రమిదల దీపాలు వెలిగించి శ్రీరామ జపంతో ప్రార్ధనలు నిర్వహించి అయోధ్య శ్రీరామచంద్రుని అక్షింతలు తమ కుటుంబ సభ్యులకు శిరస్సుపై చల్లుకుని ఆ శ్రీరామచంద్రున్ని ఆశీర్వాదం ప్రతి ఒక్కరూ పొందాలని మరియు శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజలకు అయోధ్య శ్రీరాముని ఆశీస్సులుతో ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజలు ఉండాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ, నియోజకవర్గ కో-కన్వీనర్ మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, పట్టణ అధ్యక్షులు గరికపాటి రమేష్ బాబు, జిల్లా ఉపాధ్యక్షులు కొండేటి గోపాల్, జిల్లా అధికార ప్రతినిధి అమ్మపాలెం రమణా రెడ్డి, ఓబీసీమోర్చా రాష్ట్ర సభ్యులు ఎస్వీ రమణ, సీనియర్ నేతలు జి.వి. ఆమర్నాథ్, పగడాల ప్రతాప్, ఓబీసీమోర్చా జిల్లా సెక్రటరీ పెద్దపాలెం రవి అచ్చారి తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ కమిషనర్ మరియు స్పందన

విశాలాంధ్ర - తిరుపతి : డయల్ యువర్ కమిషనర్ మరియు స్పందన కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోండని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనం హరిత ఆదివారం ఓక ప్రకటనలో తెలిపారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో జనవరి 22వ తేది సోమవారం ఉదయం 9:30 గంటల నుండి 10:30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం అదేవిధంగా అర్జీలు, పిర్యాధులు ఇచ్చేవారికి కోసం ఉదయం 10:30 నుండి "స్పందన" కార్యక్రమం జరుగుతుందన్నారు. పోన్ ద్వారా పిర్యాధులు చేసేవారు 0877-2227208 కి కాల్ చేసి మాట్లాడవచ్చని, ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవల్సిందిగా తిరుపతి ప్రజలకు కమిషనర్ తెలియజేసారు.

లెనిన్ విప్లవ స్ఫూర్తి అజరామరం

విశాలాంధ్ర - తిరుపతి : మార్క్స్ మహోపాధ్యాయుని మేధస్సును పూర్తిగా ఆకలింపు చేసుకున్నవాడై నిర్దిష్ట పరిస్థితుల్లో మార్క్సిజం ఎలా అన్వయించుకోవాలో ప్రపంచ కార్మిక వర్గానికి దిశా నిర్దేశం చేసి మొట్టమొదటి సోషలిస్టు రాజ్యాన్ని స్థాపించిన మహా విప్లవ నేత కామ్రేడ్ లెనిన్ అని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి సి సుధాకర్ రెడ్డి అన్నారు. ప్రపంచంలోనే అత్యధిక భూమిని దున్నేవానికి చెందాలంటూ భూపంపిణీ చేసిన ఘనత కామ్రేడ్ లెనిన్ కి దక్కుతుందని అటువంటి మహా మనిషి వందో వర్ధంతి జరుపుకుంటున్నా, యావత్ ప్రపంచ కార్మిక వర్గం మదిలో లెనిన్ ఎప్పటికీ సజీవంగానే ఉంటారని, ఆయన ఆశయ సాధనలో కమ్యూనిస్టులు ఎప్పటికీ నడుస్తారని అన్నారు. మార్క్సిస్టు తత్వశాస్త్రం ద్వారా ప్రపంచ గతిని మార్చడంలో లెనిన్ సఫలీకృతమయ్యారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు నాగేంద్ర,బాలు, చెంచమ్మ, ప్రభుదాస్, వెంకట కృష్ణయ్య, ఖాసిం, హరి,వనజ పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - చంద్రగిరి: వివాహ బంధంతో సరికొత్త జీవితానికి నాంది పలుకుతున్న నూతన వధూవరులు బిరుదాల తరుణ్ రెడ్డి, నారాయణిలను ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆశీర్వదించారు. తుడా ఛైర్మెన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రీనివాసమంగాపురం ఎల్ ఎస్వీ కళ్యాణ మండపంలో తుమ్మలగుంట ఉప సర్పంచ్ బిరుదాల గోపాల్ రెడ్డి తనయుడు తరుణ్ రెడ్డి నిశ్చితార్థ వేడుకకు ఎమ్మెల్యే, తుడా ఛైర్మెన్ హాజరయ్యారు. మీ జంట ఆనందకర జీవితాన్ని అనుభవించాలని ఆకాంక్షించారు. ఈ మా కార్యక్రమానికి స్థానిక శాసనసభ్యులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి చంద్రగిరి నియోజకవర్గ వైకాపా అభ్యర్థి మోహిత్ రెడ్డి రావడం మాకు ఎంతో ఆనందదాయకంగా ఉందని గోపాల్ రెడ్డి కుటుంబీకులు పేర్కొన్నారు.

శ్రీరామనామ స్మరణతో మారుమోగిన నాయుడుపేట

విశాలాంధ్ర - నాయుడుపేట : శ్రీరామ జన్మభూమి అయోధ్యలో బాలరాముని విగ్రహప్రతిష్ట సోమ వారం జరుగునున్న నేపథ్యంలో సంఘీభావంగా ఆదివారం నాయుడుపేట పట్టణంలో శ్రీరామ భక్త బృందం ఆధ్వర్యం లో శ్రీరాముని శోభాయాత్ర కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. పట్టణంలోని శ్రీ విజయ గణపతి ఆలయం వద్ద నుండి పురవీధుల మీదుగా కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద ఉన్న శ్రీరామాలయం వరకు శ్రీరామ శోభాయాత్ర జరిగింది. ఈ సందర్భంగా శ్రీరాముని చిత్రపటాన్ని ఊరేగిస్తూ శ్రీరామ స్మరణలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. శ్రీరామ నామ స్మరణతో పట్టణం మారు మోగింది. ఈకార్యక్రమంలో తిరుపతి జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు సన్నారెడ్డి దయాకర్ రెడ్డి,బిజెపి నాయకులు, కార్యకర్తలు, పట్టణ ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

రైతులు, వినియోగదారుల కోసమే అన్నప్రసాదం

విశాలాంధ్ర - చంద్రగిరి: ప్రతి ఆదివారం చంద్రగిరిలో జరిగే వారపు సంత లో ప్రజలకు ప్రతి వారం డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి మరియు చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి చిరు వ్యాపారుల సౌకర్యార్థం సంతకు వచ్చేటువంటి ప్రజలకు ప్రతివారపు సంతలో నియోజకవర్గంలోని అన్ని మండలాలలో అన్న ప్రసాద వితరణ చేయడం జరుగుతున్నది. ఈ నేపథ్యంలోనే ఆదివారం చంద్రగిరి వారపు సంతలో వైకాపా నాయకులు దూరప్రాంతాల నుంచి వస్తున్న వినియోగదారులకు అన్నప్రసాదాలు వితరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి స్థానిక నాయకులు డివిజన్ అధ్యక్షులు తొండవాడ డివిజన్ అధ్యక్షులు పసల నాగరాజు, రాయలపురం సర్పంచ్ వెంకటయ్య, నర్సింగాపురం ఎంపీటీసీ అశ్విని ప్రవీణ్ కుమార్, సచివాలయం కన్వీనర్ వెంకటేష్, మదన్ మోహన్ రెడ్డి, సిద్ధిక్ భాష, మట్టి రెడ్డి నవీన్ రెడ్డి , బుల్లెట్ భాను, మణికంఠ, వైకాపా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అబాకస్ విద్యార్థులకు బహుమతులు ప్రదానం

విశాలాంధ్ర - తిరుపతి రూరల్ : ఆన్‌లైన్ మాధ్యమం ద్వారా అబాకస్ శిక్షణ పొందిన విద్యార్థులకు బహుమతులను ఆర్.కె. అబాకస్ ఛైర్మన్, డైరెక్టర్ డాక్టర్ ఆర్.కె.రెడ్డి విమల ఆదివారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆర్.కె.రెడ్డి విమల మాట్లాడుతూ స్థానిక ఎం.ఆర్.పల్లి కూడలి నందు గల ఆర్.కె.అబాకస్ శిక్షణా కేంద్రం నందు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ ద్వారా విద్యార్థులకు గత 13 సంవత్సరాలుగా శిక్షణ ఇస్తూ ఎంతో మంది విద్యార్థిని విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును దిశానిర్దేశం చేస్తున్న ఏకైక శిక్షణ సంస్థగా తిరుపతి నందు ఆర్.కె.అబాకస్‌కు ఒక ప్రత్యేక గుర్తింపు ఉందని తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆన్‌లైన్ అబాకస్ శిక్షణ ఇస్తూ, అందులో ప్రావీణ్యత చూపినటువంటి హైదరాబాద్‌కు చెందిన విద్యార్థి అద్విక్ 3వ విభాగం నందు ప్రథమ బహుమతి పొందారన్నారు. ఈ సందర్భంగా సంస్థ ఛైర్మన్ డాక్టర్ రామక్రిష్ణారెడ్డి, డైరెక్టర్ ఆర్.కె.విమల, అధ్యాపక బృందం బి.ప్రతాప్‌రెడ్డి అభినందనలు తెలిపారు. అదే విధంగా విద్యార్థి తల్లిదండ్రులు కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వర స్వామి వారి దర్శన అనంతరం విచ్చేసి ఆర్.కె.అబాకస్ సంస్థ నందు బహుమతి పొందడం పూర్వజన్మ సుకృతమని తెలిపారు. ఆర్.కె.అబాకస్ సంస్థ ద్వారా జాతీయ, అంతర్జాతీయంగా ఆన్‌లైన్ ద్వారా అత్యుత్తమ శిక్షణ పొందుతున్న వందలాది విద్యార్థులకు మార్గనిర్దేశం చేస్తూ, వివిధ స్థాయిలలో బహుమతులు పొందుతున్నందుకు చాలా సంతోషంగా ఉందని సంస్థ డైరెక్టర్ తెలిపారు. సైనిక, రక్షణ రంగంలో, వార్తా పత్రికలు, పోలీస్ రంగాలలో పనిచేసే ఉద్యోగుల పేద విద్యార్థిని విద్యార్థులకు రాయితీతోపాటు శిక్షణ అందిస్తున్నామని చెప్పారు. విద్యార్థిని విద్యార్థులకు చక్కటి అబాకస్ శిక్షణ కొరకు మరిన్ని వివరాలకై 9989500074, 7386502450 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

రిషితారెడ్డిని పరామర్శించిన వినుత కోటా

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి బొజ్జ సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషితారెడ్డిని జనసేన పార్టీ ఇన్‌ఛార్జి వినుత కోటా ఆదివారం పరామర్శించారు. ఈ నెల 20వ తేదిన రోషితా రెడ్డి పట్టణంలోని శ్రీరామ్ నగర్ కాలనీ నందు ప్రచారం నిర్వహిస్తున్నపుడు కొంత మంది వైసీపీ కార్యకర్తలు వారి వాహనాన్ని అడ్డుకుని అసభ్యంగా వ్యవహరించిన తీరును ఖండిస్తూ ఆదివారం ఊరందురులోని వారి ఇంటికి నాయకులు, జనసైనికులు, వీర మహిళలతో వెళ్లి పరామర్శించి వినుత కోట తమ మద్దతు తెలిపారు. ప్రజాస్వామ్యంలో ప్రచారం చేసుకునే హక్కు ప్రతి ఒక్కరి హక్కు అని, అడ్డుకోవడం ఏ సంస్కృతి అని తెలిపారు. వైసీపీ ఆగడాలను ధీటుగా ఎదుర్కొంటామని, టీడీపీ నాయకులకి, కార్యకర్తలకు జనసేన పార్టీ మద్దతు ఉంటుందని తెలిపారు. పోలీసులు ఇలాంటి ఆకతాయిలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

దళిత ద్రోహి సీఎంకు అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే హక్కు లేదు

తల్లి, చెల్లికి న్యాయం చేయని జగన్ ప్రజలకు న్యాయం చేస్తారా..?

ఎస్సీ, ఎస్టీల 27 పథకాలు ఎత్తేసిన ఘనుడు జగన్

విశాలాంధ్ర - గూడూరు : దళిత ద్రోహి సీఎం జగన్మోహన్ రెడ్డికి అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే అర్హత లేదని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్ అన్నారు. ఆదివారం గూడూరు పట్టణంలోని గమళ్లపాలెం టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి 27 సంక్షేమ పథకాలు ఎత్తి వేసిన గనత సీఎం జగన్మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సునీల్ కుమార్ మాట్లాడుతూ అమరావతిలో 206 అడుగుల ఎత్తైన అంబేద్కర్ విగ్రహాన్ని సుమారు 400 కోట్ల రూపాయల నిధులతో అంబేద్కర్ స్మృతి వనం ఏర్పాటు చేసేందుకు సంకల్పించిన వ్యక్తి చంద్రబాబు అని తెలిపారు. అయితే అంబేద్కర్ పేరు మీద ఉన్న విదేశీ విద్య పథకానికి పేరు మార్చిన ఘనత జగన్మోహన్ రెడ్డిదన్నారు. వైకాపా పాలనలో రాష్ట్రంలో దళితులపై దాడులు, హత్యలు జరిగాయన్నారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే అర్హత సీఎం జగన్మోహన్ రెడ్డికి లేదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బిల్లు చెంచు రామయ్య, రహీమ్, ఇశ్రాయిల్ కుమార్, సునీల్, శ్రీనివాసులు, పెంచలయ్య, చేవూరు సురేంద్ర, నాజర్, సద్దాం, ముర్తుజ, షాహిద్, పాల్గొన్నారు.

దివ్యాంగులకు కూరగాయలు, గుడ్లు పంపిణీ

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు పట్టణంలోని డాక్టర్ సీఆర్. రెడ్డి విశ్రాంత ఉద్యోగుల బవనంలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నీలేష్ పుట్టిన రోజు సందర్భంగా చెంచు నారాయణ దాతృత్వంతో దివ్యాంగులకు కూరగాయలు, గుడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జేవివి అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ చెంచునారాయణ తన కుమారుని జన్మదిన వేడుకలు కుటుంబ సభ్యులతో కాకుండా దివ్యాంగులను ఆదుకోవాలనే ఆలోచనతో ఈ కార్యక్రమానికి దాతగా వ్యవహరించడం హర్షణీయమన్నారు. జేవివి ఆధ్వర్యంలో ప్రతి నెల మూడవ ఆదివారం దివ్యాంగులకు కూరగాయలు, గుడ్లు పంపిణీ చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. దివ్యాంగులకు ఆసరాగా నిలుస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వేగూరు రాజేంద్రప్రసాద్, చెంచునారాయణ, గుర్రం విజయ్ బాబు, రామమోహన్, పురుషోత్తమ రావు, సుబ్రహ్మణ్యం, మురళీసింగ్, మధు, సుబ్బారావు , రాజేష్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

తుదిశ్వాస ఉన్నంత వరకూ ప్రజాసేవలో తరిస్తా : ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు నియోజకవర్గ అభ్యర్థిగా మేరిగ మురళీధర్ పేరు ప్రకటించగానే టీడీపీ శ్రేణుల్లో కలవరం మొదలైందని వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం గూడూరు పట్టణంలోని సనత్ నగర్లో ఉన్న ఎమ్మెల్సీ, నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళీధర్ నివాస ప్రాంగణంలో నిర్వహించిన వైసీపీ శ్రేణుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గూడూరు డివిజన్ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సీఎం స్వయంగా చెప్పారన్నారు. మూడు నియోజకవర్గ ప్రజలతో నేదురుమల్లి కుటుంబం మమేకమై ఉందన్నారు. గూడూరు నియోజకవర్గ అభ్యర్థిగా మేరిగ మురళి నిలబడుతున్నారని, ఈ విషయం తెలియగానే టీడీపీ నేతల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. ఏకంగా అభ్యర్థినే మార్చే ప్రయత్నంలో ఉన్నట్లు తెలిసిందన్నారు. తిరుపతి జిల్లాలోని ఏడు నియోజకవర్గ అసెంబ్లీ సీట్లను గెలిపించుకోవాలన్నారు. సూళ్లూరుపేటలో కిలివేటి సంజీవయ్య పోటీచేస్తున్నారన్నారు. కొందరికి ఆశలు, అనుమానాలు ఉండొచ్చన్నారు. ఏపీలో ఎక్కడ మార్పులు జరిగినా కొంత అసంతృప్తి ఉంటుందని కానీ 70 ప్రాంతాల్లో సీట్లు ప్రకటిస్తే ఒక్క గూడూరులోనే అసంతృప్తి లేదన్నారు. అందరికీ ఇష్టుడు, ఆమోదయోగ్యుడు మేరిగ మురళి అన్నారు. మెజారిటీపై దృష్టి పెట్టి జగన్మోహన్ రెడ్డి నమ్మకాన్ని నిజం చేసి ఇప్పటివరకూ వచ్చిన మెజారిటీకి మూడింతలు రావాలని సూచించారు. ఏ అభ్యర్థి వచ్చినా టీడీపీకి ఓటమి ఖాయమన్నారు. ఏడు నియోజకవర్గాల సభ, మాజీ సీఎం వచ్చినా కేవలం 15 వేల మంది మాత్రమే వచ్చారని,సభ వెలవెలబోయిందన్నారు. మ రెండు నెలలు కంకణబద్ధులై పనిచేయాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రతి ఐదు జిల్లాలకు ఒక సభ ఏర్పాటు చేసి ఎన్నికల సమరంపై నాయకులను ఉత్తేజపరుస్తారన్నారు. నెలాఖరులోగా తిరుపతిలో సభ ఉంటుందన్నారు. ఏప్రిల్ మొదటివారంలో ఎన్నికలు ఉంటాయన్నారు. కలిసి పనిచేయాలన్నారు. వెంకటగిరి నియోజకవర్గ పరిధిలో 76వేల ఇళ్లు తిరిగానని, క్షేత్ర స్థాయిలో జగన్మోహన్ రెడ్డి, వైసీపీ పార్టీపై తిరుగులేని అభిమానం చూశానన్నారు. మరోసారి వైసీపీ ప్రభుత్వం ఏర్పడుతుందన్నారు. నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ మాట్లాడుతూ జెడ్పీటీసీగా రాజకీయాలలో ప్రస్థానం చేసిజగన్మోహన్ ధైర్య సాహసాలను చూసి వైసీపీలో చేరానన్నారు. ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొనే నాయకులకు జగన్ చేయూతనిచ్చారన్నారు. తనను నియోజకవర్గంలోని రెండు కుటుంబాల పెద్దలు ఆశీర్వదించారని, వారందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. సీఎం తనకు స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఇచ్చారన్నారు. పార్టీ కుటుంబ సభ్యుడిని కావడమే అదృష్టంగా భావిస్తానన్నారు. , జగన్మోహన్ రెడ్డి పేరు పెట్టి పిలిచే స్థాయి దక్కడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్లు తెలిపారు. నా అభ్యున్నతిని కాంక్షించే ఈ ప్రాంత నాయకుల మద్దతుతోనే తనకు సీఎం జగన్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించారని, మీతో మళ్లీ సెహబాష్ అనిపించుకుంటానని నాయకులు, అభిమానుల కరతాళ ధ్వనుల నడుమ ప్రకటించారు. ప్రజల మన్ననలు పొందిన కుటుంబాలన్నీ వైసీపీలోనే ఉండడం తనకు కలిసొచ్చే అంశమన్నారు. ఈ సమావేశంలో కొడవలూరు ధనుంజయ్ రెడ్డి, దువ్వూరు మధుసూధన్ రెడ్డి, పొణకా దేవసేనమ్మ, మల్లు విజయ్ కుమార్ రెడ్డి, బొమ్మిడి శ్రీనివాసులు, బత్తిని విజయ్ కుమార్, ఎంపీపీ బూదూరు గురవయ్య, కోడూరు మీరారెడ్డి, కల్పలత, గూడూరు రాజారెడ్డి, మొబీన్ బాష, తాళ్ళూరు శ్రీనివాసులు, కొండూరు సునీల్ రెడ్డి, బట్టా గోపి, జహీర్, బాబు, కబీర్, నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

28న బలిజ ఉద్యోగుల ఆత్మీయ సమావేశం

బీఈఏఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పి. అనిల్ కుమార్

విశాలాంధ్ర - గూడూరు : ఈ నెల 28వ తేదీన బలిజ ఉద్యోగుల ఆత్మీయ సమావేశం గూడూరు రెండవ పట్టణంలోని కాస్మోపాలిటన్ క్లబ్ లో నిర్వహించనున్నట్లు బలిజ అభ్యుదయ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు, విశ్రాంత ట్రాన్స్ కో డీఈ పి. అనిల్ కుమార్ తెలిపారు. ఆదివారం గూడూరులోని ఎస్ఎస్ కన్వెన్షన్ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బలిజ ఉద్యోగుల ఆత్మీయ సమావేశానికి డివిజన్ పరిధిలోని అన్ని మండలాల బలిజ ఉద్యోగులు తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆత్మీయ సమావేశంలో బలిజల సమస్యలపై చర్చిస్తామన్నారు. అలాగే బలిజ అభ్యుదయ సేవా సమితి నెల్లూరు జిల్లా క్యాలెండర్ ను ప్రముఖ పారిశ్రామికవేత్త, గ్రూప్ థియేటర్ల యజమాని, బలిజ అభ్యుదయ సేవా సమితి నాయకులు చదలవాడ హరిప్రసాద్ చేతులమీదుగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆ సమితి గూడూరు డివిజన్ గౌరవాధ్యక్షులు సారంగం శ్రీనివాసులు, శేషయ్య, సాయి కల్యాణ్, జగదీష్, శ్రీనివాసులు, మదనమేటి రమణయ్య, పప్పు వీరేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

విజయసాయిరెడ్డిని కలిసిన మేరిగ మురళీధర్

విశాలాంధ్ర - గూడూరు : సూళ్లూరుపేట నియోజకవర్గంలో సామాజిక సాధికార యాత్రలో పాల్గొనడానికి ఆదివారం నాయుడుపేట కిన్నెర హోటల్ కు విచ్చేసిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యులు వేణంబాక విజయసాయి రెడ్డిని ఉమ్మడి నెల్లూరు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ, గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళీధర్ మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం సమర్పించారు.

ప్రపంచ మానవాళికి మార్గదర్శకులు లెనిన్

గూడూరులో లెనిన్ వందవ వర్థంతి వేడుకలు

విశాలాంధ్ర - గూడూరు : ప్రపంచ మానవాళికి మార్గదర్శకులు కామ్రేడ్ లెనిన్ అని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సీహెచ్. ప్రభాకర్ అన్నారు. ఆదివారం గూడూరులోని సీపీఐ కార్యాలయంలో రష్యా సోషలిస్ట్ నాయకుడు లెనిన్ వందవ వర్ధంతిని నిర్వహించారు. లెనిన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రష్యాలో 1890 నుండి 1924 వరకూ అనేక పోరాటాలతో కమ్యూనిస్టు విప్లవాన్ని ముందుకు తీసుకెళ్లి సోషలిస్టు పాలనను ప్రజలకందించిన ఘనత లెనిన్ కే దక్కిందన్నారు. రష్యాలో సోషలిస్ట్ పాలన స్థాపన అనంతరం ప్రపంచంలోని 130 దేశాలలో కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించిందన్నారు. లెనిన్ ఆశయాలను ముందుకు తీసుకెళతామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జీ. శశి కుమార్, రైతు సంఘం జిల్లా నాయకులు సీఆర్. కుమార్, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి ఎంబేటి చంద్రయ్య, ఇన్సాఫ్ సమితి రాష్ట్ర ఉప కార్యదర్శి షేక్. జమాలుల్లా తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపితేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం:మాజీ మంత్రి అమర్

విశాలాంధ్ర- పలమనేరు : వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపితేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని మాజీ మంత్రి అమరనాథ రెడ్డి పేర్కొన్నారు. నాలుగున్నరేళ్ళ వైకాపా పాలనపై స్పందిస్తూ పలమనేరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఐదేళ్లలో రాష్ట్రంలో ఆదాయం పెరగలేదని ఉద్యోగాలు రాలేదన్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక బటన్ నొక్కుడు బాదుడే బాదుడు తప్పా ప్రజలకు ఒరిగింది ఏమీ లేదన్నారు. మద్య నిషేధం చేసాకే ఓటు అడుగుతానన్న జగన్ ఆ మాటపై కట్టుబడలేదన్నారు. జగన్ అధికారం చేపట్టాక పంట కాలవల్లో నీళ్లకు బదులు రైతుల కన్నీళ్లు పాడుతున్నాయని ఉపాధి కోసం బయట ఊళ్ళోకి వెళ్లి బతకాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వైసిపి పాలనలో నష్టపోయింది బడుగు బలహీనవర్గాలేనని ఆ పార్టీ నేతల వేధింపులతో ఎస్సీలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిప్రజలకు సామాజిక న్యాయం చేశానని చెబుతున్న జగన్ జీవో నెం.3ను ఎందుకు రద్దు చేశారో సమాధానం చెప్పాలన్నారు. భూకబ్జాలకు పాల్పడే వారికే న్యాయం చేసే ప్రభుత్వం వైకాపా అని ఎద్దేవా చేశారు. భూ రక్షణ చట్టం అమల్లోకి వస్తే ప్రజల భూములు గోవిందా అని టిడిపి వచ్చాక భూ రక్షణ చట్టం రద్దు చేస్తామని పేర్కొన్నారు. చెల్లికి న్యాయం చేయలేని వారు ఇక ప్రజలకు ఏం చేస్తారో ప్రజలు ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. విలువలు లేని వ్యక్తులు రాజకీయాలకు అనర్హులని నీతి నిజాయితీతో రాజకీయాలు చేసే వ్యక్తులు కావాలని పేర్కొన్నారు. పేదలను సంపన్నులను చేసే బాధ్యత తెలుగుదేశం పార్టీ తీసుకుంటుందని తాము అధికారంలోకి వచ్చిన తర్వాత అంగన్వాడీ కార్యకర్తల డిమాండ్లను పరిష్కరిస్తామని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు.

క్రికెట్ క్రీడా విజేతలుగా టీకేఎం పేట

విశాలాంధ్ర - కార్వేటిన గరం: యువతను క్రీడల్లో ప్రోత్సాహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆడుద్దాం.. ఆంధ్రా క్రీడలు నిర్వహిస్తోందని ఎంపీపీ లతబాలాజీ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆర్వేఎస్సార్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ పోటీలో విజేతలుగా నిలిచిన టీకేఎం పేట క్రీడా కారులకు క్రికెట్ క్రీడా సామగ్రిని అందించి అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మారు మూల గ్రామాల్లో క్రీడా కారుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుద్దాం.. ఆంధ్రా క్రీడలు ఎంతో దోహదపడుతుందన్నారు. అలాగే క్రీడల్లో గెలుపోటములు సహజమని, విజేతలుగా నిలిచిన వారిని స్ఫూర్తిగా తీసుకుని విజేతలుగా నిలవడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎంపీడీవో మోహన మురళీ మాట్లాడుతూ మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడా జట్టు నియోజకవర్గం స్థాయిలో నిర్వహించే క్రీడల్లో పాల్గొనడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహించే పోటీల్లో ప్రతిభ చూపి కార్వేటినగరం మండలానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని సూచించారు. ఈ క్రమంలో భాగంగా క్రికెట్ విజేతలుగా నిలిచిన టీకేఎం పేట క్రీడా జట్టుకు క్రీడా సామగ్రిని అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ధనంజయవర్మ ఉప సర్పంచ్ శేషాద్రి. ఈవో పీఎన్ మణి, పీడీలు మురళీకృష్ణరాజు, పలువురు పాల్గొన్నారు.

ఎస్ఐ ఏమయ్యాడు ? సిఐ బదిలీ

-గాడి తప్పిన పోలీస్ వ్యవస్థ -స్టేషన్ బాధ్యత ఎవరిది...!

విశాలాంధ్ర - బుచ్చినాయుడు కండ్రిగ : మునుపెన్నడు లేనివిధంగా 15 రోజులుగా విధి నిర్వహణలో లేని ఎస్సై ఏమయ్యాడంటూ మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ లో ఎస్సై విధులు నిర్వహిస్తున్న వెంకట నరసింహ స్టేషన్లో లేకపోయేసరికి సర్వత్ర విమర్శలకు తావిస్తున్నది. స్టేషన్ బాధ్యతలు ఎవరికి ఇచ్చారు అంటూ ప్రశ్నలతో ముడిపడి ఉన్నది. నాలుగు నెలల క్రితం తిరుపతి పట్టణము నుండి ఇక్కడకు బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టిన ఎస్సై వెంకట నరసింహ ఒకసారి గా ప్రజల్లో కనబడకపోయేసరికి బదిలీపై వెళ్లాడా లేక ఏమయ్యాడు మండలంలో రాజకీయ నాయకులు అన్ని వర్గాల ప్రజలు పెదవి విరుస్తున్నారు. అతి తక్కువ సమయంలో మండల ప్రజలకు చేరువైన ఎస్ఐ అని సేవలు మరువలేమంటూ ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలలో భాగంగా సిఐ విక్రమ్ బదిలీపై తిరుపతి పట్టణానికి 'విఆర్ 'కు బదిలీపై వెళ్ళిపోయారు, ఎస్సై వెంకట్ నరసింహ గతంలో తిరుపతి పట్టణంలో ఎం ఆర్ పల్లి పోలీస్ స్టేషన్ విధులు నిర్వహిస్తున్న సమయంలో తిరుపతి పార్లమెంట్ ఉప ఎన్నికలలో భాగంగా ఓట్లు విషయమై అవక తవకు లకు పాల్పడినట్లు అప్పట్లో ఎన్నికల కమీషనర్ కు ఫిర్యాదు చేసారంటు ఆరోపణలు అప్పట్లో జరిగిన విషయంపై ఇప్పుడు ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషనర్ అప్పట్లో వచ్చిన ఫిర్యాదులపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రస్తుత డీజీపీని ఆదేశించడంతో తిరుపతి ఎస్పీ, శ్రీకాళహస్తి డిఎస్పి, స్థానిక ఎస్సై ,లను సహా డీజీపీ కార్యాలయమున వెళ్లాలని ఆదేశించడంతో దీనిపై సమగ్ర విచారణ పూర్తి అయ్యేవరకు ఎస్సై విధులు హాజరు కాకూడదని ఎన్నికల కమిషనర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు విశ్వసనీయ సమాచారం గత 15 రోజులుగా స్టేషన్ లో ఎస్సైగా బాధ్యతలు ఎవరు నిర్వహిస్తున్నారని ప్రశ్నిస్తున్నారు . ఎస్సై లేని స్థానంలో సీఐ బాధ్యతలు నిర్వహించేవారు కాని ఇప్పుడు ఇద్దరూ లేకపోవడంతో పోలీస్ స్టేషన్ గాడి తప్పిందని ఆరోపణలు ఉన్నాయి. దీంతో మండల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు ఎస్సై పై వచ్చిన ఆరోపణలపై క్రమశిక్షణ చర్యలు 'ఈసీ' విచారణలో భాగంగా ఉన్నాడని విశ్వసనీయ సమాచారం.

చిత్తూరులో ఎన్నికల ప్రచారానికి టిడిపి జనసేన శ్రీకారం

విశాలాంధ్ర -చిత్తూరు: జిల్లా కేంద్రంలో చిత్తూరు నగరంలో రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో టిడిపి జనసేన నేతలు మూకుమ్మడిగా ఆదివారం ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. నగరంలోని మురుకంబట్టు వద్ద ఉన్న సప్త కన్నికల ఆలయంలో ఇరు పార్టీలకు చెందిన నేతలు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రానున్న ఎన్నికల్లో అధికార పార్టీని ఓడించాలని ప్రజలకు విన్నవిస్తూ ప్రచారానికి నాంది పలికారు. ఈ సందర్భంగా టిడిపి జనసేన పార్టీ అధిష్టానాలు టికెట్ ఎవరికి ఇచ్చిన గెలుపు కోసం అందరూ కృషి చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు దొరబాబు, చంద్రప్రకాష్ ,గురజాల జగన్మోహన్, కటారి హేమలత, డీకే బద్రి నారాయణ, సి ఆర్ రాజన్ ,కాజూర్ బాలాజీ, మోహన్ రాజ్, జనసేన నేతలు యశ్వంత్ దయారాం, ఆరని కవిత, ఇరు పార్టీలకు చెందిన పార్టీ నేతలు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మాంబేడులో జల్లికట్టు...!

- జన సంద్రం లో గ్రామ పరిసరాలు
- పలువురికి గాయాలు

విశాలాంధ్ర-వెదురుకుప్పం: మండలంలోని మాంబేడు లో జల్లికట్టు ఆదివారం ఘనంగా నిర్వహించారు.ముందస్తు ప్రచారం ఉండడం తో జిల్లా లోని పలు ప్రాంతాలు నుంచి జనాలు భారీగా తరలివచ్చారు, అలాగే ఇతర ప్రాంతాలనుంచి పశువులను తీసుకొచ్చారు.జల్లికట్టు లో వినియోగించడానికి వచ్చిన ఎద్దులు, ఆవులను ప్రత్యేకంగా అలంకరించారు.పశువుల కొమ్ములకు పట్టీలు కట్టి జన సమూహం లోకి వదిలారు.పరుగులు తీస్తూ వచ్చే ఎద్దులు, ఆవుల్ని నిలువరించి బహుమతులు కైవసం చేసుకునే క్రమంలో పలువురి కి గాయాలయ్యాయి. అనంతరం టిడిపి యాదవ సాధికార సమితి మరియు జీడి నెల్లూరు నియోజకవర్గ యువత అధ్యక్షులు గురుసాల కిషన్ చంద్,మండల యాదవ సాధికార సమితి అధ్యక్షులు గురవయ్య, గ్రామ కమిటీ అధ్యక్షుడు మోహన్ యాదవ్,ప్రధాన కార్యదర్శి యుగుందర్,గ్రామ యువత ఆధ్వర్యంలో అన్నదానం చేసారు. చిదురు ముదురు ఘటనల మినహా జల్లికట్టు ప్రశాంతంగా ముగిసింది.

విజయసాయిరెడ్డిని కలిసిన తులసిరెడ్డి

విశాలాంధ్ర - బాలాయపల్లి :వైసిపి రీజనల్ కోఆర్డినేటర్ రాజ్యసభ ఎంపీ విజయసాయిరెడ్డిని ఆదివారం వెంకటగిరి వైసీపీ సమన్వయ కర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి, తిరుపతి జిల్లా మహిళా అధ్యక్షులు మాధవి రెడ్డి తో కలిసి బాలాయపల్లి మండల వైసీపీ నాయకురాలు కాటూరు తులసి రెడ్డి నాయుడుపేట లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన కు పూల బొకే అందజేసి శాలువాతో సత్కరించారు.

ప్రశ్నించే తత్వం మట్టిఅద్దం

మానవ విలువల ప్రతిబింబం మట్టిఅద్దం
మట్టిఅద్దం పుస్తకావిష్కరణ
సమకాలీన సామాజిక అంశాలు

విశాలాంధ్ర-తిరుపతి: తెలుగు భాష,సంస్కృతి, విద్య, ప్రకృతి, పర్యావరణం,కుటుంబ బంధాలు, మానవ విలువల పతనం పట్ల ప్రశ్నించే తత్వమే యువశ్రీ మురళి మట్టిఅద్దం కవితా సంపుటి అని, ఈ కవిత్వం సమాజానికి దర్పణమని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన శాఖ అధిపతి రాజేశ్వరమ్మ అన్నారు.అభ్యుదయ రచయితల సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షులు, ఉపాధ్యాయ సంఘం నాయకులు యువశ్రీ మురళి కవితాసంపుటి మట్టిఅద్దం పుస్తకావిష్కరణ సభ తిరుపతి నగరంలోని యూత్ హాస్టల్ లో అభ్యుదయ రచయితల సంఘం తిరుపతి జిల్లా శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ నెమిలేటి కిట్టన్న అధ్యక్షతన సాయంత్రం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా శ్వేత పూర్వ సంచాలకులు భూమన్ పాల్గొని మాట్లాడుతూ పల్లెటూరి మట్టి వాసనలకు మట్టి అద్దం కవితలు దర్పణమని అన్నారు.ఉమ్మడి చిత్తూరు జిల్లా తూర్పు ప్రాంతానికి చెందిన కవి యువశ్రీమురళి ఉపాధ్యాయ, భాషోద్యమ నాయకులుగా మట్టిఅద్దం కవితల్లో మానవీయ విలువల్ని ఆవిష్కరించారని సమీక్షకులు,కేంద్ర సాహిత్య అకాడమీ యువపురస్కార గ్రహీత పల్లిపట్టు నాగరాజు అన్నారు.ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా రచయితల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సాకం నాగరాజ, మన్నవ గంగాధర ప్రసాద్, గంగవరం శ్రీదేవి,గంటా మోహన్ , పేరూరు బాలసుబ్రమణ్యం, శతావధాని ఆముదాల మురళి,తమటం రామచంద్రారెడ్డి, గండుపల్లి గోవిందయ్య,కలువగుంట రామమూర్తి, తోట వెంకటేశ్వర్లు ,ఆకుల మల్లేశ్వరరావు, ఏడుకొండలు, మల్లారపు నాగార్జున, నద్ది నారాయణ, పురుషోత్తమాచారి, ముని మోహన్ సిద్దారెడ్డి ,దేవరాజులురెడ్డి, పురుషోత్తం నాయుడు, కన్నయ్య, ఏనుగు అంకమనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ జాబితా అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి

పోలీస్ స్టేషన్‌లో పులివర్తి నాని ఫిర్యాదు



విశాలాంధ్ర-పాకాల : ఓటరు జాబితాలో అక్రమాలకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని చంద్రగిరి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ పులివర్తి నాని ఆదివారం పాకాల పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే ఎక్కడా లేని విధంగా చంద్రగిరి నియోజకవర్గంలో ఓటరు జాబితా లో అక్రమాలు చోటు చేసుకున్నాయన్నారు. ఫారం -6, ఫారం -7, ఫారం -8 ల ద్వారా ఇష్టానుసారంగా దొంగఓట్లను చేర్చడంతో పాటు టిడిపి సానుభూతిపరుల ఓట్లను తొలగించడం జరిగిందన్నారు. ఎన్నికల అధికారులు ఉపయోగించే సాఫ్ట్ వేర్ ద్వారా లాగిన్ అయి మరీ ఈ అక్రమాలకు పాల్పడ్డారని ఈ ఘటనపై విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. ఈ మేరకు టిడిపి జనసేన నాయకులతో కలిసి పాకాల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.